విశాఖపట్టణం
ఆదివారం 6 సెప్టెంబర్ 2026
For a pure tomorrow..
జయ జయహే
epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 205 వెల: రూ.5/- పేజీలు: 8
Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# ఇక 28 కొత్త జిల్లా పరిషత్‌లు

### 15 జడ్పీ సీఈఓ పోస్టులకు ఆమోదం

### పంచాయతీరాజ్‌లో కీలక మార్పులు

**(అమరావతి - జయజయహే)**

ప్రభుత్వం పంచాయతీ రాజ్ వ్యవస్థలో మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన జిల్లాల సంఖ్యకు అనుగుణంగా జిల్లా పరిషత్‌లను పునర్వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దీని ద్వారా ఇప్పటివరకు అందుబాటులో ఉన్న 13 జిల్లా పరిషత్‌ల స్థానంలో 28 కొత్త జిల్లా ..మిగతా 2లో





## టీసీఎస్ హైపర్ వాల్ట్

# డేటా సెంటర్

### హైదరాబాద్‌లో టీసీఎస్ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు

### రూ. 70వేల కోట్ల పెట్టుబడి

### 250 ఎకరాల్లో 1 గిగావాట్ సెంటర్

### ఏడు వేల మందికి ఉద్యోగాలు

**(హైదరాబాద్ - జయజయహే)**

తెలంగాణ ఐటీ రంగ చరిత్రలో మరో అధ్యాయం ఆవిష్కృతం కానుంది. గ్లోబల్ ఐటీ హబ్‌గా దూసుకుపోతున్న భాగ్యనగరం ఇప్పుడు 'గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ క్యాపిటల్'గా మారే దిశగా కీలక ఒప్పందం జరిగింది. దేశంలోనే అత్యంత భారీ, అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అనుబంధ సంస్థ 'హైపర్ వాల్ట్' అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు సంబంధించి శనివారం సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో యాజమాన్యం ..మిగతా 2లో

# పీఆర్సీకి ఓకే..!

### రెండు డిఏలకు గ్రీన్ సిగ్నల్

### సరెండర్ లీవ్ నిధులు సంక్రాంతికి

### జనవరి నుంచి అడిషనల్ క్వాంటం పెన్షన్





**(అమరావతి - జయజయహే)**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభవార్త చెప్పారు. డీఏలతో పాటు పీఆర్సీపై కీలక ప్రకటన చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రభుత్వ ఉద్యోగులు భాగస్వాములని.... వారికి తమ ప్రభుత్వం సాధ్యమైనంత వరకు అన్ని విధాలా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలపై ముఖ్యమంత్రి అమరావతిలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఈ భేటీలో ఉద్యోగుల సంక్షేమం, బకాయిల చెల్లింపులకు సంబంధించి సీఎం చంద్రబాబు పలు నిర్ణయాలు తీసుకున్నారు.

**కీలక నిర్ణయాలు ఇవే**

ఉద్యోగులు సుదీర్ఘకాలంగా కోరుతున్న వేతన సవరణ కోసం 12వ పీఆర్సీ నియామకానికి ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఉద్యోగులకు అందాల్సిన బకాయిల్లో 1-7-2024 మరియు 1-1-2025 కి సంబంధించిన రెండు కరవు భత్యాలను (డీఏలు) 2026 అక్టోబర్ 1వ తేదీ నుంచి చెల్లించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 2022 సంవత్సరానికి సంబంధించిన పెండింగ్ సరెండర్ లీవుల నిధులను వచ్చే సంక్రాంతి పండుగ కానుకగా ఉద్యోగుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేయడానికి సీఎం ఆమోదం తెలిపారు. శాంతిభద్రతల నిర్వహణలో ..మిగతా 2లో





# రైల్వే భారీ ప్లాన్

### 260 వందే భారత్ స్లీపర్ ట్రైన్‌లు... రాత్రివేళ సుదూర ప్రాంతాలకు

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

పగటిపూట ప్రయాణించే సెమీ హైస్పీడ్ రైళ్లుగా గుర్తింపు పొందిన వందే భారత్ ఇప్పుడు రాత్రివేళ ప్రయాణాల వైపు అడుగులు వేస్తోంది. సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం వందే భారత్ స్లీపర్ సర్వీసులను విస్తరించేందుకు భారతీయ రైల్వే రంగం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా 260 వందే భారత్ స్లీపర్ రైళ్లను తయారు చేయాలని సంకల్పించింది. ఈ స్లీపర్ సిరీస్‌లో తొలి రైలు గువాహటీ-హౌరా మార్గంలో ఇప్పటికే ప్రయాణికులకు అందుబాటులోకి రాగా, రెండో రైలు ప్రస్తుతం పట్టాలపై ట్రయల్ రన్స్ పూర్తి చేసుకుంటోంది. ఈ రెండో రైలును బెంగళూరు - ముంబై మార్గంలో నడిపే ఆలోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నప్పటికీ, ..మిగతా 2లో

## మున్సిపల్ ఎన్నికల

# నియమావళి ఖరారు

### అభ్యర్థికి 4 సెట్ల నామినేన్ కు ఛాన్స్

### ఆస్తులు, అప్పులు, విద్యార్హతలపై అఫిడవిట్ తప్పనిసరి

### కొత్త నిబంధనలు జారీ చేసిన ప్రభుత్వం

**(అమరావతి - జయజయహే)**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై కొత్త నిబంధనలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసింది. మున్సిపల్ (సవరణ) చట్టం-2026 అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆగస్టు 28వ తేదీ నుంచే చట్టసవరణ అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఈ మేరకు జీవో నంబర్-210ని జారీ చేసింది. మేయర్, కార్పొరేటర్ల ఎన్నికల నియమావళిని ఖరారు చేస్తూ మరో జీవో నంబర్ - 211ని పురపాలక శాఖ జారీ చేసింది. ఈ నేపథ్యంలో నామినేషన్ డిపాజిట్లను ఖరారు చేసింది. జనరల్ ..మిగతా 2లో

## మూడు రోజులు

# వర్షాలు

### బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

### ఉత్తరాంధ్రకు ఎల్లో అలెర్ట్

**(విశాఖపట్నం - జయజయహే)**

తమిళనాడు తీరప్రాంతం, దానిని ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. మరోవైపు.... దక్షిణ తెలంగాణ నుండి రాయలసీమ మరియు తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. దీని ..మిగతా 2లో



# నిజాన్ని పాతిపెట్టలేరు

### అకౌంట్లు బ్లాక్ చేస్తే దాగిపోవు

### డీఎస్సీ అక్రమాలపై నిజాలు నిగ్గు తేలాలి.. జీఓలు జారీ.. ఆపై వరుస రద్దు

### సీబీఐతో విచారణ జరపాల్సిందే.. మాజీ సీఎం వైఎస్ జగన్ ధ్వజం



**(తాడేపల్లి - జయజయహే)**

డీఎస్సీ 2025 నియామకాల్లో అక్రమాల వ్యవహారం రోజురోజుకూ బట్టబయలవుతోందని వైసీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మరిన్ని కొత్త ఆధారాలు, వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. అవన్నీ డీఎస్సీలో జరిగిన అక్రమాలను బయటపెడుతూ, సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాల్సిన అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రశ్నలు లేవనెత్తారు. "ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పి, నిజాలను నిగ్గు తేల్చేందుకు సీబీఐ విచారణకు అంగీకరించాల్సిన ప్రభుత్వం.. స్వతంత్ర దర్యాప్తును తిరస్కరిస్తోంది. మరోవైపు ప్రశ్నిస్తున్న గొంతులను అణచివేసే మార్గాన్ని టీడీపీ ఎంచుకుంది. డీఎస్సీ నియామకాల అక్రమాలపై గొంతెత్తుతున్న ప్రతిపక్షంతో పాటు, కొన్ని మీడియా సంస్థలు, సామాజిక కార్యకర్తలు, వ్యక్తులకు సంబంధించిన సామాజిక పోస్టులు, ఖాతాలను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో నియంత్రిస్తున్నారు. చట్టపరమైన ఆదేశాలు అంటూ వాటిని తొలగించడం లేదా జియోబ్లాక్ చేస్తున్నారు. ఆ ఆంక్షల బారిన పడిన ఖాతాలు, పేజీలు, ఫేస్‌బుక్‌లో సాక్షి టీవీ, ఇన్‌స్టాగ్రామ్‌లో సాక్షి డిజిటల్, బిగ్ టీవీ, జగనన్న కనెక్ట్స్‌తో పాటు, డీఎస్సీ స్కామ్‌పై ప్రశ్నిస్తున్న ఇతర వ్యక్తిగత హ్యాండిల్స్ కూడా ఉన్నాయి" అని వైఎస్ జగన్ ..మిగతా 2లో

# ముహూర్తం ఫిక్స్

### 7న కొత్త రాజకీయ పార్టీ

### భవిష్యత్తు రాజకీయ ప్రయాణంపై విజయసాయి పోస్టు



**(హైదరాబాద్ - జయజయహే)**

మాజీ ఎంపీ వేణుంబాక విజయసాయిరెడ్డి తన భవిష్యత్ రాజకీయ ప్రయాణానికి సంబంధించి మరో అప్డేట్ ఇచ్చారు. ఈ నెల 7వ తేదీ, సోమవారం మధ్యాహ్నం 1:15 గంటలకు విజయవాడలోని 'లెమన్ ట్రీ ప్రెమియర్' హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రెస్ మీట్‌లో తన రాజకీయ భవిష్యత్, రాబోయే రోజుల్లో అనుసరించబోయే వ్యూహాలపై ముఖ్యమైన ..మిగతా 2లో

# రైల్వే భారీ ప్లాన్

మొదటి పేజీ తరువాయి...

దీనిపై రైల్వే శాఖ అధికారికంగా స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఈ 260 వందే భారత్ స్లీపర్ రైళ్ల ఉత్పత్తిని పలు ప్రముఖ తయారీ సంస్థలు పంచుకోనున్నాయి. మొదటి 10 స్లీపర్ రైళ్లను 'బీఈఎంఎల్' సంస్థ తయారు చేస్తోంది. ఇవి ఒక్కోటి 16 కోచ్‌లతో రూపొందుతున్నాయి. చెన్నైలోని 'ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ'మరొక 50 రైళ్లను తయారు చేయనుంది. ఇవి 24 కోచ్‌లతో పాటు ప్రత్యేక పాంట్రీ కార్‌ను కలిగి ఉంటాయి. మరో 200 రైళ్ల తయారీకి సంబంధించిన కాంట్రాక్ట్‌లో భాగంగా.. 'ఆర్‌వీఎన్‌ఎల్', రష్యాకు చెందిన 'ట్రాన్స్‌మాష్ హోల్డింగ్' భాగస్వామ్యంతో ఏర్పడిన 'కైనెట్ రైల్వే సొల్యూషన్స్' 120 రైళ్లను ఉత్పత్తి చేస్తుంది. మిగిలిన 80 రైళ్లను 'టిటాగఢ్-బీహెచ్‌ఈఎల్' ఉమ్మడి సంస్థ నిర్మిస్తుంది. మహారాష్ట్ర లాతూర్‌లోని మరాఠ్వాడా రైల్ కోచ్ ఫ్యాక్టరీలో కైనెట్ సంస్థ తన ఉత్పత్తిని చేపట్టింది. ఈ సంస్థ తన తొలి ప్రోటోటైప్ రైలును 2027 మార్చి 31 నాటికి సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.



### గంటకు 160 కిలోమీటర్ల వేగం

వందే భారత్ స్లీపర్ రైళ్లను గంటకు 180 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించేలా డిజైన్ చేశారు. ట్రాక్ మౌలిక వసతులు, రూట్ ఆధారంగా పట్టాలపై వీటిని గంటకు 160 కిలోమీటర్ల వేగంతో నడుపుతారు. సాధారణ రైళ్లలాగా వీటిని లాగడానికి ప్రత్యేక లోకోమోటివ్ (ఇంజిన్) అవసరం లేదు. డిస్ట్రిబ్యూటెడ్ పవర్ సిస్టమ్‌తో నడిచే ఈ రైళ్లలో త్వరితగతిన వేగం అందుకోవడం, క్షణాల్లో బ్రేకులు వేయడం సాధ్యమవుతుంది. దీనివల్ల ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. ప్రస్తుతం సిద్ధమవుతున్న 16 కోచ్‌ల రైలులో 11 ఏసీ 3-టియర్, 4 ఏసీ 2-టియర్, 1 ఏసీ ఫస్ట్ క్లాస్ కోచ్ ఉంటాయి. రాత్రివేళ సుఖవంతమైన ప్రయాణం కోసం మెత్తటి బెర్త్‌లు, రీడింగ్ లైట్లు, మొబైల్ ఛార్జింగ్ పాయింట్లు, ఆటోమేటిక్ డిస్ప్లే బోర్డులు, సమాచారాన్ని అందించే స్పీకర్ వ్యవస్థలను అమర్చారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆటోమేటిక్ తలుపులు, కోచ్‌ల మధ్య శబ్దం రాకుండా ఉండేలా సీల్డ్ గ్యాంగ్‌వేలను ఏర్పాటు చేశారు. ఏసీ ఫస్ట్ క్లాస్ కోచ్‌లలో అదనపు హంగుగా వేడి నీటితో కూడిన షవర్ సదుపాయం కల్పించారు. రైలు ప్రమాదాలను నివారించేందుకు భారతీయ స్వదేశీ పరిజ్ఞానం 'కవచ్' వ్యవస్థను ఈ రైళ్లలో అమర్చారు. ఎమర్జెన్సీ కమ్యూనికేషన్ సిస్టమ్, సెంట్రలైజ్డ్ కోచ్ మానిటరింగ్‌తో పాటు విద్యుత్ పొదుపునకు తోడ్పడే రీజెనరేటివ్ బ్రేకింగ్ వ్యవస్థ ఉంది. ప్రయాణికులలో పరిశుభ్రత పెంచేందుకు విమానాల్లో వాడే తరహా 'బయో వాక్యూమ్' మరుగుదొడ్లను చేర్చారు. దివ్యాంగ ప్రయాణికుల కోసం ప్రత్యేక వాష్‌రూమ్ వసతులు ఉన్నాయి. ఈ 260 రైళ్ల రాక ఒకేసారి కాకుండా విడతల వారీగా జరగనుంది. ప్రోటోటైప్ రైళ్ల తయారీ, ట్రయల్స్, సర్టిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే వివిధ రూట్లలో వీటిని ప్రవేశపెడతారు.




# మున్సిపల్ ఎన్నికల నియమావళి ఖరారు

మొదటి పేజీ తరువాయి...

అభ్యర్థులకు రూ.5,000, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.2,500 డిపాజిట్ చేయాలని ఏపీ సర్కార్ పేర్కొంది. ఒక అభ్యర్థి గరిష్ఠంగా 4 సెట్ల నామినేషన్లు మాత్రమే వేసేందుకు ఏపీ ప్రభుత్వం అవకాశం కల్పించింది. అభ్యర్థుల నేర చరిత్ర, ఆస్తులు, అప్పులు, విద్యార్హతలపై నోటరీతో కూడిన అఫిడవిట్ తప్పనిసరి అని స్పష్టం చేసింది. పోలింగ్ కేంద్రాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే ఓటు రద్దు చేస్తామని హెచ్చరించింది. బ్యాలెట్ పేపర్ వెనక్కు తీసుకునే సర్వాధికారాలు ప్రిసైడింగ్ అధికారికి అప్పగించినట్లు తెలిపింది. అంధులు, వృద్ధులకు ఓటింగ్ సమయంలో సాయం చేసేందుకు 18 ఏళ్లు నిండిన ఒకరికి మాత్రమే అనుమతి ఉంటుందని వెల్లడించింది. ఓ వ్యక్తి కేవలం ఒక్క ఓటరుకు మాత్రమే సహాయకుడిగా ఉండాలనే కఠిన నిబంధనను ప్రభుత్వం స్పష్టం చేసింది.

## భక్తులను ఆకట్టుకున్న బాల సౌజన్య కుమారి భాగవత లీలా ప్రవచనం

అనకాపల్లి (జయ జయహే)



శ్రీ గవరపాలెం శ్రీ సంతోషిమాత దేవస్థానం లో శ్రావణమాసాన్ని, గోకులాష్టమని పురస్కరించుకుని 4వ శ్రావణ శుక్రవారం రోజున ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక ప్రవచనముతో శ్రవణానంద, నయనానంద శోభతో ధార్మిక వెల్లివిరిసింది. నంది అవార్డు గ్రహీత,తెలుగు ఆచార్యులు మహిళా కీర్తిరత్న జాతీయ పురస్కార గ్రహీత, కళతపస్వి అవార్డు గ్రహీత, విద్యావేత్త,ఆధ్యాత్మికవేత్త ప్రవచన కర్త ఏ బాల సౌజన్యకుమారి చే భాగవత లీలా ప్రవచనం శ్రీకృష్ణతత్వం జీవన సన్మార్గ వారధి అనే అంశం పైన ప్రవచనం జరిగింది. శ్రీకృష్ణతత్వం అంటే ప్రేమ పూర్వక విధానం శ్రీకృష్ణుడు జగద్గురువు గురువులందరికి గురువు కృష్ణం వందే జగద్గురు అనే విషయాన్ని పండిత పామరులకు సైతం అర్థమయ్యే విధంగా జీవితానికి ఉదహరిస్తూ చాలా చక్కగా వివరించారు. శ్రీకృష్ణుడు లీలలు అన్ని కృష్ణతత్వం కోసం ప్రతిబింబించే విధంగా చేశాడని చెప్పారు. చెరసాలలో పుట్టినప్పటికీ శంఖచక్ర గధ ధారుడై నవ్వుతూ జన్మించాడని ప్రతి మనిషి లోకంలో కొన్ని కొన్ని విషయాలకి శోకంతో కాకుండా ఆనందంతో నవ్వుతూ ఉండడమే కృష్ణ తత్వం అని అన్నారు. కర్మాన్యే వాధికారస్తే మా పలేషు కదాచన అనగా కర్మ చేయడం మన వంతు ఫలితం భగవంతుడు ఒంతు అని వివరించారు. విద్యార్థి దశ నుంచి కృష్ణ తత్వాన్ని ఎవరైతే అవలంబిస్తారో వారు ఖచ్చితంగా జీవితంలో విజయాలు సొంతం చేసుకుంటారు అని చెప్పారు. సంతోష్ మాత దేవస్థాన చైర్మన్ మారిశెట్టి భాస్కర రావు మాజీ చైర్మన్ దాడి వాసు ధర్మకర్తల మండలి ఈశ్వరరావు, కిరణ్ సన్యాసినాయుడు, రాజేష్, రాధ, మోహన్ ఇతర సభ్యులు ప్రవచన కర్త సౌజన్య ను జ్ఞాపిక శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం దేవస్థాన ప్రాంగణంలో జరిగిన రంగవల్లికల పోటీలో సౌజన్య న్యాయ నిర్ణేయతగా వహించి విజేతలు ప్రధమ రాధికా 3000/-,ద్వితీయ జయ మాధురి 2000/-,తృతీయ కృష్ణ వేణి లకు 10000/- నగదు బహుమతులను సౌజన్య మరియు ధర్మకర్తల మండలి ఆలయ కమిటీ సభ్యుల ప్రధానం చేశారు.

# మూడు రోజులు వర్షాలు

మొదటి పేజీ తరువాయి...



ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రాయలసీమ, దక్షిణ కోస్తా, ఉత్తర కోస్తా ప్రాంతాల్లో గంటకు 30 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ, ఒకటి లేదా రెండు చోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాబోయే కొన్ని గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ముఖ్యంగా చిత్తూరు జిల్లాకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. శ్రీసిటీ, సత్యవేడు, తడ మరియు దాని పరిసర ప్రాంతాలలో రాబోయే 3 గంటల్లో అక్కడక్కడా తీవ్రమైన పిడుగులతో కూడిన ఈదురుగాలుల వర్షం కురిసే అవకాశం ఉంది. ఉత్తర కోస్తా మరియు ఇతర జిల్లాల విషయానికి వస్తే విజయనగరం, అనకాపల్లి, ఎన్టీఆర్ మరియు కృష్ణా జిల్లాలకు అధికారులు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. అక్కడక్కడా తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడతాయని, ప్రయాణాల్లో ఉన్నవారు మరియు తీరప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం.... తెలంగాణ రాష్ట్రంలో కూడా రాబోయే ఐదు రోజుల పాటు ఎలాంటి తీవ్ర హెచ్చరికలు లేవు. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉంది.

# నిజాన్ని పాతిపెట్టలేరు

మొదటి పేజీ తరువాయి...

అన్నారు. టీడీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ వ్యవహారం కేవలం డీఎస్సీ స్కామ్‌తోనే ఆగిపోవడం లేదన్నారు. కూటమిప్రభుత్వ అవినీతి, వైఫల్యాలు, అమలు కాని సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ ఎన్నికల హామీలు, నిరంకుశత్వం, అధికార దుర్వినియోగంపై ప్రశ్నిస్తున్న ప్రతి ఒక్కరినీ లక్ష్యంగా చేసుకుంటున్నారని జగన్ ఆరోపించారు. ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, ప్రశ్నించిన వారి గొంతు నొక్కేస్తున్నారని మండిపడ్డారు. ఇది పరిపాలన కాదు. నియంతృత్వ సెన్సార్‌షిప్ అన్నారు. వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛ భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులని చెప్పారు. ప్రశ్నలు రాజకీయంగా ఇబ్బందికరంగా ఉన్నాయనే కారణంతో ప్రతిపక్షం, మీడియా, సామాజిక కార్యకర్తలు, పౌరుల గొంతు నొక్కే అధికారం ఏ ప్రభుత్వానికీ లేదన్నారు.

### నిజాన్ని పాతిపెట్టలేరు

"చంద్రబాబు.. మీరు భయపడుతున్నది ప్రశ్నలకా? లేక వాటి సమాధానాలకా? డీఎస్సీ నియామకాల్లో ప్రతిరోజూ కొత్తగా వెలుగు చూస్తున్న ఆధారాలు ఒకవేళ అవాస్తవమైతే.. ప్రజల ముందుకు వచ్చి వాస్తవాలతో వాటిని ఖండించండి. ఆ పని చేయడం లేదు. ఇంకా సీబీఐ విచారణను కూడా ఎందుకు తిరస్కరిస్తున్నారు? అక్రమాలను బయట పెడుతున్న వారి గొంతు ఎందుకు అణచివేస్తున్నారు? వారి పోస్టులు, ఖాతాలను ఎందుకు నియంత్రిస్తున్నారు? ఒక్క విషయం గుర్తుంచుకోండి. ఒక పోస్టును తొలగించినంత మాత్రాన ఆధారాలు చెరిగిపోవు. ఒక ఖాతాను బ్లాక్ చేసినంత మాత్రాన నిజాన్ని పాతిపెట్టలేరు. ప్రతిపక్షాన్ని రాజకీయంగా ఎదుర్కోండి. ప్రజలకు ప్రజాస్వామ్యబద్ధంగా సమాధానం చెప్పండి" అని వైఎస్ జగన్ సవాల్ విసిరారు.

### జీవోలు జారీ - ఆపై రద్దు

డీఎస్సీ పరీక్ష రాయకుండానే, టెట్‌లో ఉత్తీర్ణులు కాకుండానే కొందరికి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చారని వైఎస్ జగన్ ఆరోపించారు. డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా భర్తీ కోసం కొత్తగా జీఓలు జారీ చేశారన్నారు. ఆ నియామకాలు పూర్తి చేయగానే, ఆ జీఓలు రద్దు చేశారని మండిపడ్డారు. అయినప్పటికీ ఆ జీఓల ద్వారా నియమితులైన అభ్యర్థులు ఉద్యోగాల్లో కొనసాగుతున్నారన్నారు. అంటే అక్రమ నియామకాలకు ముందు గేట్లు తెరిచి.. ఆ నియామకాలు పూర్తయ్యాక వాటిని మూసివేశారన్నారు. ఇదంతా అవినీతిని సూచించడం లేదా? అందుకే నియంతృత్వ సెన్సార్‌షిప్‌లో భాగంగా నియంత్రించిన ప్రతి సామాజిక మాధ్యమ ఖాతాను, పోస్టును, కంటెంట్‌ను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. "సీఎం చంద్రబాబు, ఆయన ప్రభుత్వానికి నేను ఒక సవాల్ చేస్తున్నాను. డీఎస్సీ-2025 నియామకాలు నిజాయతీగా, పారదర్శకంగా జరిగాయని అనుకుంటే వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించండి. స్వతంత్ర దర్యాప్తు ద్వారా నిజానిజాలు తేల్చండి. అలాగే డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగినట్లు ఆధారాలతో సహా బయటపడుతున్నందున, వాటికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలి" అని వైఎస్ జగన్ సవాల్ విసిరారు.



# టీసీఎస్ హైపర్ వాల్ట్ డేటా సెంటర్

మొదటి పేజీ తరువాయి...

అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్ పరిధిలో దాదాపు 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో, 1 గిగావాట్ (1,000 మెగావాట్లు) భారీ సామర్థ్యంతో ఈ ఏఐ డేటా సెంటర్ రూపుదిద్దుకోనుంది. హైపర్ వాల్ట్ తన భాగస్వామ్య సంస్థలతో కలిసి ఈ ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ కోసం రూ.70,000 కోట్ల భారీ నిధులను వెచ్చించనుంది. ఈ మెగా ప్రాజెక్ట్ ద్వారా తెలంగాణలోని నైపుణ్యమున్న యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7,000 ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

### సీఎంతో కీలక భేటీ - కీలక అంశాలపై చర్చ

ఈ కీలక ఒప్పందానికి ముందు టీసీఎస్ అగ్రనాయకత్వం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డితో సమావేశమైంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీనియర్ అధికారులు ఈ భేటీలో పాల్గొన్నారు. టీసీఎస్ సీఈఓ కె. కృతివాసన్, సీఓఓ ఆర్తి సుబ్రమణియన్, హైపర్ వాల్ట్ ప్రెసిడెంట్ వి. రాజన్న, సీఈఓ దీపేష్ నందా నేరుగా హాజరవ్వగా.... అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 'ఓపెన్ ఏఐ' చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఉదయ్ రుద్రరాజు పాల్గొన్నారు. ప్రపంచంలోని టాప్ ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలకు అవసరమైన భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులను ఈ కేంద్రం అందిస్తుంది. అధిక సామర్థ్యమున్న కంప్యూటింగ్ సిస్టమ్స్, అడ్వాన్స్‌డ్ లిక్విడ్ కూలింగ్ టెక్నాలజీ వంటి సాంకేతికతతో పర్యావరణానికి అనుకూలమైన 'గ్రీన్ ఎనర్జీ' మరియు 'వాటర్-న్యూట్రల్' డిజైన్‌తో ఈ ప్రాజెక్టును నిర్మించనున్నారు.

ఒప్పందం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇది తెలంగాణకే కాకుండా మొత్తం దేశానికే ఒక చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. "నా కల నెరవేరింది. ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ఇది బలమైన పునాది. తెలంగాణ రైజింగ్ విజన్-2047లో భాగంగా నిర్దేశించుకున్న 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్య సాధనలో ఈ ప్రాజెక్టు గేమ్‌చేంజర్‌గా నిలుస్తుంది" అని స్పష్టం చేశారు. ఐదు పోటీ రాష్ట్రాలను అధిగమించి తెలంగాణ ఈ ప్రాజెక్టును సాధించడం విశేషమని అధికారవర్గాలు తెలిపాయి. 2026 జనవరిలో దావోస్ పర్యటనలో టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌తో సీఎం జరిపిన ప్రాథమిక చర్చలే నేడు ఈ భారీ పెట్టుబడికి పునాది వేశాయని చెప్పుకొచ్చాయి.

# పీఆర్సీకి ఓకే..!

మొదటి పేజీ తరువాయి...

కీలక పాత్ర పోషిస్తున్న పోలీసు శాఖ ఉద్యోగులకు వచ్చే దసరా పండుగ సందర్భంగా ఒక అదనపు సరెండర్ లీవ్ డబ్బులను చెల్లించాలని నిర్ణయించారు. విశ్రాంత ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను జనవరి 2027 నుంచి అమలు చేయనున్నారు. దీని ద్వారా 70 ఏళ్లు దాటిన పెన్షనర్లకు 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం మేర అదనపు పెన్షన్ లబ్ధి చేకూరనుంది. ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు సంబంధించి హెల్త్ స్కీమ్‌ను సంపూర్ణంగా స్ట్రీమ్‌లైన్ చేయనున్నారు. వచ్చే నెల నుంచే ఏ నెలకు ఆ నెల ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు నిర్ణీత నిధులను చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఈ కీలక నిర్ణయాల వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతి ఏటా దాదాపు రూ. 2,880 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది. అయినప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికే తమ ప్రాధాన్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# ఇక 28 కొత్త జిల్లా పరిషత్‌లు

మొదటి పేజీ తరువాయి...

పరిషత్‌లుగా రూపుదిద్దుకోనున్నాయి. నూతనంగా ఏర్పడిన మార్కాపురం, పోలవరం జిల్లాలకు సైతం ప్రభుత్వం జడ్పీలను మంజూరు చేసింది. ఈ నూతన జడ్పీల నిర్వహణ, పరిపాలనా సౌలభ్యం కోసం ఏపీ ప్రభుత్వం అదనపు పోస్టులను సమకూర్చింది. ఇందులో భాగంగా నూతనంగా 15 జడ్పీ సీఈఓ పోస్టులతో పాటు, మరొక 15 డిప్యూటీ సీఈఓ పోస్టుల ఏర్పాటుకు ఆర్థిక శాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపాయి. ప్రస్తుతం కొనసాగుతున్న జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీకాలం సెప్టెంబర్ 24వ తేదీన ముగియనుంది. ఈ పదవీకాలం పూర్తయిన వెంటనే 28 నూతన జడ్పీల వ్యవస్థ అధికారికంగా అమల్లోకి రానుందని తెలుస్తోంది.

# ముహూర్తం ఫిక్స్

మొదటి పేజీ తరువాయి...

నిర్ణయాన్ని ప్రకటించబోతున్నట్లు మీడియా వేదికగా విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించనట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్న కూటమి ప్రభుత్వం రాజకీయాలు, సామాన్య మానవుడి సంకల్పం, ఆశయాలు, ప్రయోజనాలను ప్రతిబింబించడంలో విఫలమవుతోందో ఈ సందర్భంగా అన అభిప్రాయాన్ని చెప్పనున్నారు. ఇదివరకే పొలిటికల్ ఎంట్రీపై క్లారిటీ ఇచ్చిన విజయసాయిరెడ్డి తన జెండా, రాజకీయ అజెండా, విధానాలపై క్లారిటీ ఇచ్చే అవకాశం ఉందని అంతా భావిస్తున్నారు. సోమవారం జరగనున్న ఈ ప్రెస్ మీట్‌కు మీడియా మిత్రులు హాజరై, నిష్పక్షపాతంగా దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలని విజయసాయిరెడ్డి విజ్ఞప్తి చేశారు. రాజకీయంలో మరో కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది. మాజీ ఎంపీ వేణుంబాక విజయసాయి రెడ్డి నూతన రాజకీయ పార్టీని స్థాపించబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఇటీవల తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, కొత్త పార్టీ ఏర్పాటుపై క్లారిటీ ఇచ్చారు. ప్రజల తరఫున, ప్రజల కోసం, ప్రజాపక్షంగా నిలబడి వారి గొంతును అసెంబ్లీతో పాటు పార్లమెంట్‌లోనూ బలంగా వినిపించడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల తరఫున ఒక న్యాయవాదిగా, బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా సేవ అందిస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల సమస్యలను రాజకీయ వేదికలపై బలంగా ప్రస్తావించడంతో పాటు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే పార్టీ కార్యాచరణ ఉంటుందన్నారు. నూతన పార్టీ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియలను ఈ నెలలోనే ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. విజయవాడ వేదికగా ఈ నెలలోనే విస్తృత స్థాయి మీడియా సమావేశాన్ని నిర్వహించి, తన భవిష్యత్ రాజకీయ ప్రణాళిక, పార్టీ విధివిధానాలు, కార్యాచరణకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రకటిస్తానని చెప్పారు.

# గోదావరి జలాల రాకతో అనకాపల్లి జిల్లా సస్యశ్యామలం

**అనకాపల్లి జయ జయహే**



గోదారి జలాలు అనకాపల్లి జిల్లాకు రావడంతో ఈ ప్రాంతంతో సస్యశ్యామలం అయిందని మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు పోలవరం ఎడమ కాలువ నుంచి గోదావరి జలాలు అనకాపల్లి ప్రాంతానికి చేరుకున్న శుభ సందర్భంగా శనివారం మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కసింకోట మండలం తాళ్లపాలెం గ్రామంలో పోలవరం కాలువలో కి వచ్చిన గోదారమ్మ తల్లి జలాలకు పసుపు కుంకుమ పువ్వులు రవిక సమర్పించి జల హారతి ఆయన ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాల అనకాపల్లి జిల్లాకు ప్రాంతానికి చేరడం ఎంతో ఆనందకరమైన చారిత్రకమైన విషయమని ఆయన పేర్కొన్నారు దశాబ్దాలుగా కొనసాగుతున్న పోరాటాల ఫలితంగా నేడు గోదావరి జలాలు అనకాపల్లికి చేరాలని ఆయన ఆనంద వ్యక్తం చేశారు ఈ ప్రాజెక్టు కోసం గతంలో పలువురు నాయకులు చేసిన కృషిని ఆయన గుర్తు చేసుకున్నారు పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ముందుకు తీసుకువెళ్లేందుకు సహకరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి ప్రాజెక్టు పనులు వేగవంతం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రోత్బలంతో 12 వేల కోట్ల రూపాయలు కేటాయింపు చేశారని పోలవరం ఎడమ కాలువ ద్వారా తూర్పుగోదావరి జిల్లాకి మన జిల్లా కలిపి 2,87, 000 ఎకరాల భూమికి సాగునీటి అందుతుందని తొలి దశలో అనకాపల్లి జిల్లాలో సుమారు 46వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తదుపరి దశలో మరొక విస్తీర్ణానికి అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు అదేవిధంగా తాలపాలెం పరిసర ప్రాంతాల్లోని చెరువులకు లిప్టులు ద్వారా గోదారి జలాలను అందించే రైతులకు ప్రయోజనం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని గోదావరి జలాలను ఏలేరు కాలువతో అనుసంధానం చేయడం ద్వారా విశాఖపట్నం తాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కారం లభించడంతోపాటు పరిశ్రమలకు కూడా నీరు సౌకర్యం మెరుగుపడుతుందని రామకృష్ణ పేర్కొన్నారు అనకాపల్లి జిల్లా పారిశ్రామిక జిల్లాగా రాష్ట్రంలో అత్యధిక ఉద్యోగం కల్పించే జిల్లాగా మారిపోతుందని కొన్ని వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో మన జిల్లాని అభివృద్ధి చేస్తున్నారని 2028 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంతో పూర్ణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పోలవరం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతం సస్యశ్యామలంగా మారి రైతులు ప్రజలు పరిశ్రమలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర అనకాపల్లి జిల్లా బిజెపి అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు కూటమి నాయకులు కార్యకర్తలు రైతులు ప్రజలు మహిళలు ఈ గోదావరి జల హారతి కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది



## ఘనంగా జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం

**అనకాపల్లి జయ జయహే**

ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా శనివారం గుండాల జంక్షన్ ఆర్ వో ఆఫీస్ నందు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పాల్గొనడం జరిగింది అక్కడ కార్యక్రమంలో ఏర్పాటుచేసిన సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేయడం జరిగింది . ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ మన జీవితాలకు విద్యను అందించి మంచి మార్గంలో నడిపించి బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు గురువులు మన జీవితాల్లో తల్లిదండ్రులతో సమానమైన స్థానం కలిగిన వారు ఈ రోజున గురువులను గౌరవించడం మన సనాతన సాంప్రదాయం అని సామాన్య ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి భారత రాష్ట్రపతిగా ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ న్ జన్మదినా ని ఉపాధ్యాయ దినోత్సవం గా జరుపుకోవడం మనందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వారి ఆధ్వర్యంలో అనేక సంస్కరణలు చేపడుతుందని ఉపాధ్యాయులకు గౌరవం స్వేచ్ఛ కల్పిస్తూ వేలాది ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు నైపుణ్యాభివృద్ధి క్రీడలు యోగ నైతిక విలువలకు ప్రాధాన్యం త ఇవ్వడం అభినందనీయమని అన్నారు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతూ రివర్స్ మైగ్రేషన్ రావడం ఉపాధ్యాయుల ప్రతిభకు నిదర్శనం అని వారి నిజాయితీకి నిదర్శనమని వారి పనితనానికి నిదర్శనం అని ఆయన కొనియాడారు ప్రతి విద్యార్థిని తమ సొంత బిడ్డగా భావించి విద్యతో పాటు క్రమశిక్షణ సంస్కారం నైపుణ్యాలను అందించే మరింత మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు ఈ సందర్భంగా రాష్ట్ర విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉపాధ్యాయులందరికీ నా హృదయపూర్వక ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు పాదాభివందనాలు అంటూ తెలియజేశారు ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర జిల్లా బిజెపి అధ్యక్షులు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు కూటమి నాయకులు ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు



## దాడి ఇన్స్టిట్యూట్లో ఘనంగా జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి జాతీయ హైవే రోడ్ లో గల దాడి ఇన్స్టిట్యూట్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో శనివారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదిన పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా కళాశాల ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భారత మాజీ రాష్ట్రపతి భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి ఎన్నో మంచి సేవలు అందించారని ఉపాధ్యాయులకు విద్యార్థులకు ఆయన ఆదర్శమూర్తిగా దిక్కుచ్చుగా నిలబడ్డారని అటువంటి మహానాయకుడు ఈ రోజున గౌరవంగా ఒక పండగ వాతావరణం లో ఉపాధ్యాయులను గురువులను గౌరవించుకుంటూ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు




## ఇండో-థాయ్ ఓపెన్ క్రికెట్ ఛాంపియన్‌షిప్‌లో తెలుగు తేజం ప్రతిభ

**7 వికెట్లతో బెస్ట్ బౌలర్.. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా గోల్డ్ మెడల్**

**దొరవారిసత్రం, సెప్టెంబర్ 05, జయ జయహే**

దొరవారిసత్రం అండర్-19 ఇండో-థాయ్ ఓపెన్ క్రికెట్ ఛాంపియన్‌షిప్-2026లో తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం శ్రీధనమల్లి గ్రామానికి చెందిన దువ్వూరు తేజ ప్రతిభ కనబరిచాడు. టోర్నీలో ఏడు వికెట్లు తీసి బెస్ట్ బౌలర్‌గా నిలవడంతో పాటు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ఛాంపియన్‌గా గోల్డ్ మెడల్ సాధించాడు. చిన్ననాటి నుంచే క్రికెట్ పై ఆసక్తి పెంచుకున్న తేజ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో క్రీడా రంగంలో రాణిస్తున్నాడు. ఇండో-థాయ్ ఓపెన్ ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శన చేసి స్వర్ణ పతకం సాధించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు. తేజ భవిష్యత్తులో క్రికెట్‌లో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు.



## కొత్తపల్లి చింతల్‌లో రెవెన్యూ గ్రామ సభ

**64 మందికి పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ**

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 05, జయ జయహే**

శ్రీకాళహస్తి: మండలంలోని మన్నవరం పంచాయతీ పరిధి కొత్తపల్లి చింతల్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభ, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ ముఖ్య అతిథిగా హాజరై గ్రామ ప్రజల సమక్షంలో లబ్ధిదారులకు పట్టాదారు పాసు పుస్తకాలను అందజేశారు. గ్రామానికి చెందిన 64 మంది అర్హులైన రైతులు, నిరుపేదలకు భూ హక్కులు కల్పిస్తూ పాసు పుస్తకాలను పంపిణీ చేయడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమైంది. ఈ సందర్భంగా బొజ్జల బృందమ్మ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి, రైతుకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ యజమానులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించి, వారి ఆస్తులకు భద్రత కల్పించాలనే ఉద్దేశంతో పాసు పుస్తకాల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రైతాంగ సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు అందుకున్న రైతులు బొజ్జల కుటుంబానికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రంగనేని చెంచయ్య నాయుడు, మండల అధ్యక్షుడు అక్షింతల కృష్ణ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కుంటిపూడి రమేష్, కృష్ణమ నాయుడు, యూనిట్ ఇన్‌చార్జ్ రఘు, సుబ్బరాయులు, మనోహర్, స్థానిక కూటమి నాయకులు, రెవెన్యూ శాఖ అధికారులు, పంచాయతీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## మాంబట్టు సెజ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**లారీ కింద నిద్రిస్తున్న డ్రైవర్‌పై నుంచి మరో లారీ దూసుకెళ్లడంతో మృతి**

**తడ, సెప్టెంబర్ 05, జయ జయహే**

తడ మండలం మాంబట్టు సెజ్‌లోని ఇ-ప్యాక్ కంపెనీ సమీపంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపై నిలిపి ఉంచిన లారీ కింద నిద్రిస్తున్న మరో లారీ డ్రైవర్‌పై నుంచి లారీ దూసుకెళ్లడంతో రాజీవ్ గాంధీ అనే డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ శివను, లారీని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇ-ప్యాక్ కంపెనీ సమీపంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా భారీ వాహనాలను నిలిపివేయడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక, నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కంపెనీ సమీపంలో భద్రతా చర్యలు చేపట్టి భారీ వాహనాల పార్కింగ్‌ను నియంత్రించాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## గణేష్ మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

**అనకాపల్లి జయ జయహే**



రానున్న వినాయక చవితి పండుగ సందర్భంగా అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాల పందిళ్లకు తప్పనిసరిగా పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్పష్టం చేశారు నిర్వాహకులు వివిధ ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరిగే ఇబ్బంది లేకుండా ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ప్రత్యేకంగా సింగిల్ విండో ఈ పోర్టల్ ప్రవేశపెట్టిందని ఆయన తెలియజేశారు ఈ విధానం ద్వారా మండపాలు ఏర్పాటు లౌడ్ స్పీకర్లు ఊరేగింపు మరియు నిమజ్జనానికి సంబంధించిన అన్ని అనుమతులను ఒకే చోట సులభంగా పొందవచ్చని మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు ఎటువంటి చలానా లు చెల్లించవలసిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు దరఖాస్తు నమోదు చేసే నిర్వాహకుల కమిటీగా ఏర్పడి https://ganeshutsav.net వెబ్ సైట్ ను సందర్శించే న్యూ అప్లికేషన్ పై క్లిక్ చేయాలని మొబైల్ నెంబర్ నమోదు చేయాలని ఆ వచ్చే ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయాలని అందులో దరఖాస్తు దారుని పేరు చిరునామా కమిటీ అసోసియేషన్ పేరు, ఈమెయిల్ ఐడి మండపం ఏర్పాటు చేసే స్థలం సంబంధిత సబ్ డివిజన్ మరియు పోలీస్ స్టేషన్ పరిధి వివరాలు గణేష్ విగ్రహం ఎత్తు మండపం కొలతలు కమిటీ సభ్యులు వివరాలు వారి ఫోన్ నెంబర్లు నిమజ్జనం నిర్వహించే తేదీ సమయము రూట్ మ్యాప్ మరియు ఉపయోగించే వాహనాలు వివరాలు దరఖాస్తు సమర్పించిన అనంతరం స్థానిక పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారని అనుమతి మంజూరైన తర్వాత https:ganeshutsav. net/applicationStatus లింకులో మొబైల్ నెంబర్ ఎంటర్ చేసి నిరంబయంతర పత్రం మరియు క్యూఆర్ కోడ్ను డౌన్లోడ్ చేసుకోవాలి డౌన్లోడ్ చేసుకున్న ఎన్ఓసి నిబంధనలతో కూడిన పత్రాన్ని లామినేషన్ చేయించి పోలీసులు అలాగే అధికారులు తనిఖీ వచ్చే సమయంలో మండపం వద్ద స్పష్టంగా కనిపించేలా అనుమతి పత్రం ఉండాలని ఆయన పేర్కొన్నారు శాంతిభద్రతలకు ఎలాంటి వివాహం కలగకుండా ప్రమాదాలు మరియు ఘర్షణలకు తావు లేకుండా పండగను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీస్ శాఖకు ప్రజలు, వస్తావా కమిటీ నిర్వాహకులు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు

## వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌లో యువత పాల్గొనాలి

**మై భారత్ డిడి మహేశ్వరరావు పిలుపు**

**విశాఖపట్నం (జయ జయహే)**

వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్--2027లో ఉమ్మడి విశాఖపట్నం ప్రాంత యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మేరా యువభారత్ ఉప సంచాలకులు జి మహేశ్వర రావు పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు - క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, మేరా యువ భారత్ నిర్వహిస్తున్న ఈ ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొనాలని ఆయన కోరారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువత ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి అర్హులన్నారు. 2026 సెప్టెంబర్ 30 వరకు మేరా యువ భారత్ వేదికలో ఆన్‌లైన్ క్విజ్‌కు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

వికసిత్ భారత్ ఛాలెంజ్ పోటీ ఆన్‌లైన్ క్విజ్, వ్యాస రచన, జిల్లా స్థాయి పోటీ, రాష్ట్ర స్థాయి పోటీ, జాతీయ స్థాయి పోటీ అనే ఐదు దశల్లో జరుగుతుందని వివరించారు.. క్విజ్‌లో ప్రతిభ కనబరిచిన వారు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఎంపికై జాతీయ స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుందని అన్నారు. జాతీయ స్థాయిలో ఎంపికైన యువత న్యూఢిల్లీలో తమ ఆలోచనలను ప్రముఖుల సమక్షంలో ప్రదర్శించే అవకాశం పొందుతారని తెలిపారు. విశాఖపట్నం। 14,474,, అనకాపల్లి 12,009,

అల్లూరి సీతారామరాజు జిల్లా 7,046

మొత్తం 33,529 యువత పాల్గొంటరని అన్నారు. కళాశాలలు, విశ్వ విద్యాలయాలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, యువజన సంఘాలు, ఇతర విద్యాసంస్థలు అర్హులైన విద్యార్థులు, యువతను ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నమోదు చేయించి విజయవంతం చేయాలని ఉపసంచాలకులు జి మహేశ్వరరావు కోరారు.



## వాహనాల చోరీ నిందితుడిని అరెస్ట్ చేసిన అనకాపల్లి టౌన్ పోలీసులు

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి పిల్ల వారి వీధి చోడవరం నివాసి ప్రస్తుతం అనకాపల్లి గొల్ల వీధిలో నివాసం ఉంటున్న కోట్ల నారాయణ(19 )నీరజ్ ) అనే వ్యక్తి గత కొంతకాలంగా పట్టణంలోని మోటార్ బైకులు చోరీ చేసి తప్పించుకు తిరుగుతూ ఉన్న అతన్ని శనివారం అనకాపల్లి టౌన్ పోలీసులు ఎన్టీఆర్ మార్కెట్ యార్డు వద్ద ఒక మూసి ఉన్న దుకాణం వద్ద తచ్చాడుతూ ఉండగా అటుగా వెళ్తున్న పోలీసులు గమనించి అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా విచారణలో నిందితుడు గతంలో పట్టణ పరిధిలో రెండు ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్లు నిందితుడు కోట్ల నారాయణ (నీరజ్ ) అంగీకరించాడు గత నెల రెండో తేదీన నెయ్యల వీధికి చెందిన బేత ప్రసాద్ బాబు ఇంటి ముందు పార్క్ చేసి న నలుపు రంగు హోండా సి బి యూని కార్న్ ాజూ31ణశ5429 26వ తేదీన కొత్తూరు గ్రామానికి చెందిన మట్టపర్తి హేమంత్ కు చెందిన నలుపు రంగు హోండా లివోూా31ణ+1709 చోరీ గురైనట్లు పోలీసులుకు బాధితులు ఫిర్యాదు ఇవ్వడం జరిగింది ఈ మేరకు అనకాపల్లి టౌన్ పోలీసులు నిందితుడు వద్ద నుంచి రెండు మోటారు వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశం మేరకు అనకాపల్లి టౌన్ పోలీసులు ఈ చోరీ కేసును ప్రెస్టేజ్ గా తీసుకొని చోరీ వాహనాలను నిందితుని త్వరగా పట్టుకోవడం జరిగింది ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరపరచగా రిమాండ్ తరలించడం జరిగింది కేసును త్వరితగతిన చేదించి పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన అనకాపల్లి టౌన్ ఎస్ఐ ఏ వెంకటేశ్వరరావు మరియు సిబ్బంది పీసీలు ఎం సముద్రం ఆర్ పి నాయుడు టీఎస్ నాయుడు లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించడం జరిగింది

For a pure tomorrow.. జయహో

# రాముడు-రావణుడు: ధర్మం VS అధర్మం

**రామాయణం భారతీయ సంస్కృతిలో ధర్మం, నీతి, కర్తవ్యబోధలకు ప్రతీక. వాల్మీకి ఈ కావ్యంలో రెండు విభిన్న మానవతాత్విక రూపాలను చిత్రించాడు --- రాముడు మరియు రావణుడు.**

**ఇద్దరూ జ్ఞానవంతులు, శక్తివంతులు, రాజ్యాధికారులు. కాని వారి జీవన ధోరణి, ధర్మబోధ పూర్తిగా భిన్నం. రాముడు ధర్మానికి ప్రతీకగా నిలుస్తాడు; రావణుడు అహంకారానికి ప్రతిరూపం.**

రాముడు -- ధర్మస్వరూపుడు

వాల్మీకి చెప్పిన ప్రసిద్ధ వాక్యం: "రామో విగ్రహవాన్ ధర్మః" --- (అరణ్యకాండ, సర్గ 9)

అంటే "రాముడు అనేది సాక్షాత్ ధర్మం యొక్క రూపం."

రాముడు రాజ్యాన్ని, సుఖాన్ని, కుటుంబాన్ని కూడా త్యాగం చేశాడు, కానీ ధర్మాన్ని ఎప్పుడూ విడువలేదు.

అయన జీవితంలోని ప్రతి నిర్ణయం ధర్మబద్ధం. పితృవచన పరిరక్షణ కోసం అరణ్యంలోకి వెళ్లడం, సీతా విమోచనం కోసం యుద్ధం చేయడం, ప్రజాభిప్రాయం కోసం సీతను విడిచిపెట్టడం --- ఇవన్నీ వ్యక్తిగత కష్టాలకన్నా ప్రజాస్వామ్య న్యాయం, కర్తవ్యభావనకు నిదర్శనం.

"ధర్మాన్నే కాపాడితే రాజ్యం నిలుస్తుంది, వ్యక్తి కాదు సమాజమే ప్రధానమని రాముడు చూపించాడు." --- (సి. రాజగోపాలాచారి)

రాముడు కేవలం రాజు కాదు; ఆదర్శ రాజు. ఆయన పాలనలో న్యాయం, సమానత్వం, మరియు ప్రజాభద్రత ప్రధాన విలువలు. అందుకే భారతీయ రాజకీయ సంస్కృతిలో "రామరాజ్యం" అనే పదం ఆదర్శ పరిపాలనకు ప్రతీక అయింది.

## రావణుడు -- అహంకారపు ప్రతీక

రావణుడు తపస్సుతో అపారమైన జ్ఞానం, శక్తి సంపాదించాడు. కానీ ఆ జ్ఞానాన్ని, ఆ శక్తిని అహంకారంగా మార్చుకున్నాడు. "రావణో నామ లోకద్రోహీ" --- (యుద్ధకాండ, సర్గ 1)

అతని పతనం ఒక స్త్రీపై దురాశతో ప్రారంభమైంది. సీతను అపహరించడం ద్వారా ఆయన తన తపస్సు ఫలితాన్ని వ్యర్థం చేసుకున్నాడు. రావణుడు వేదజ్ఞాని, సంగీతకారుడు, భక్తుడు అయినప్పటికీ, తన మనోనిగ్రహాన్ని కోల్పోయాడు.

ఇది చూపిస్తుంది --- జ్ఞానం ఉన్నంత మాత్రానా ధర్మం నిలవదు; నైతిక నియంత్రణ లేకపోతే జ్ఞానం కూడా నాశనానికి దారి తీస్తుంది.

జవహర్లాల్ నెహ్రూ తన ణఱరంఎశీఙవతీఎ శీట ×అఎఱ్ణ (1946) లో ఇలా రాశారు: "రాముడు ఆదర్శ పాలనకు ప్రతీక; రావణుడు అధికారం, మేధస్సుల దుర్వినియోగానికి ప్రతీక" (221). రావణుడు తన శక్తిని ప్రజల మేలు కోసం వాడలేకపోయాడు. శక్తి తనపై ఆధిపత్యం సాధించడంతో అతను తనే తన శత్రువుగా మారాడు.

## ధర్మం మరియు అధర్మం మధ్య సూత్రస్పర్శ

రాముడు మరియు రావణుడు మనసులోని రెండు శక్తులను సూచిస్తారు ---

1. ధర్మం (న్యాయం, దయ, కర్తవ్యబోధ)
2. అధర్మం (అహంకారం, స్వార్థం, దురాశ)

వారిద్దరి మధ్య వ్యత్యాసం ఈ విధంగా ఉంది:

| అంశం | రాముడు | రావణుడు |
|---|---|---|
| లక్ష్యం | ప్రజాహితం, సత్యనిష్ఠ | స్వప్రతిష్ఠ, అహంకారం |
| ప్రవర్తన | త్యాగం, క్షమ | దురాశ, ప్రతీకారం |
| శక్తి వినియోగం | ధర్మరక్షణ | స్వార్థపూరణ |
| ప్రతీక | సత్యం మరియు సమతా | అహంకారం మరియు క్షయము |

వారిద్దరూ మనసులోని రెండు ధోరణులను ప్రతిబింబిస్తారు. రాముడు మనలోని సత్ప్రవర్తన, రావణుడు మనలోని దురాశ.

## తాత్విక అర్థం

రామాయణం ఒక మనోవిజ్ఞాన గాథ. రాముడు మన మనస్సులోని నియంత్రిత ధర్మబుద్ధి; రావణుడు




అనియంత్రిత వాంఛల ప్రతిరూపం.

"రాముడు తన మనస్సును జయించాడు; రావణుడు తన మనస్సు చేత జయింపబడ్డాడు." --- (స్వామి చిన్మయానంద). ఇది మనకు నేర్పే ప్రధాన సూత్రం --- ధర్మం మన మనసులో ప్రారంభమవుతుంది.

## ఆధునిక భారతీయ సందర్భంలో ప్రాసంగికత

ఇప్పటి భారతదేశంలో రాముడు మరియు రావణుడు మన సామాజిక, రాజకీయ, నైతిక వ్యవస్థలలో ప్రతిరోజూ ప్రత్యక్షమవుతున్నారు.

1. నాయకత్వం మరియు పరిపాలన

రాముడు చూపించిన ఆదర్శ నాయకత్వం --- ప్రజాసేవకుడి ధోరణి, న్యాయస్ఫూర్తి, త్యాగభావం --- నేటి నాయకులకు మార్గదర్శకం.

రామరాజ్యం అంటే కేవలం ఆధ్యాత్మిక సంకల్పం కాదు; అది పారదర్శక పరిపాలన, సామాజిక సమానత్వం, ధర్మస్ఫూర్తి.

ఇది భారత రాజ్యాంగంలోని న్యాయం, సమానత్వం, స్వాతంత్ర్యం, సోదరభావం అనే విలువలతో సమానమని పండిత జవహర్లాల్ నెహ్రూ పేర్కొన్నారు.

మరోవైపు, రావణత్వం --- అంటే అధికార దుర్వినియోగం, అహంకారం, అవినీతి --- నేటి రాజకీయ వ్యవస్థలో కూడా కనిపిస్తుంది.

ఎవరైతే తమ బుద్ధిని ప్రజాసేవకు కాదు, స్వప్రయోజనానికి వాడుతారో, వారు ఆధునిక రావణులు.

2. సామాజిక నైతికత

రాముడు చూపిన సూత్రాలు నేటి కుటుంబ మరియు సామాజిక జీవితానికి కూడా ప్రాసంగికం.

తల్లిదండ్రుల గౌరవం, సత్యవచనం, ధర్మపాలన --- ఇవన్నీ రాముడి జీవన విలువలు.

రావణుడు చూపిన దారుణం మనకు హెచ్చరిక --- అహంకారం ప్రేమను నాశనం చేస్తుంది; దురాశ ధర్మాన్ని చంపుతుంది.

3. వ్యక్తిగత జీవితం

ప్రతి వ్యక్తి జీవితంలో ఒక రాముడు మరియు ఒక రావణుడు ఉంటారు.

మనలోని రాముడు మనకు సత్యం, క్షమ, నియంత్రణ నేర్పుతాడు;

మనలోని రావణుడు అహంకారం, స్వార్థం, అసూయ వైపు లాగుతాడు.

ఈ రెండు మధ్య సమతౌల్యం సాధించగలిగితేనే మన జీవితం రామాయణం అవుతుంది, లేనిపక్షంలో అది లంకావధానమే అవుతుంది.

## తాత్విక సందేశం

రామాయణం మనకు చెబుతుంది: "ధర్మం నిలిచినచోటే శాంతి ఉంటుంది; అధర్మం పెరిగినచోటే వినాశనం ప్రారంభమవుతుంది." రాముడు మనకు ధర్మం ఎలా ఆచరించాలో చూపించాడు; రావణుడు ధర్మాన్ని విస్మరించినప్పుడు ఏ విధంగా పతనం సంభవిస్తుందో బోధించాడు.

## ముగింపు

రాముడు మరియు రావణుడు కేవలం ఇద్దరు వ్యక్తులు మాత్రమే కాదు; వారు మానవ జీవన తత్వం యొక్క రెండు వైపులు.

రాముడు -- సత్యం, త్యాగం, క్షమ, సేవ.

రావణుడు -- అహంకారం, దురాశ, దుర్వినియోగం.

ఇప్పటి భారతదేశానికి రామస్ఫూర్తి అవసరం ---

ధర్మబద్ధ నాయకత్వం, ప్రజాసేవ ధోరణి, న్యాయం, మరియు సత్యవచనం.

మనలోని రాముణ్ని మేల్కొలిపితేనే సమాజం ధర్మమార్గంలో ముందుకు సాగుతుంది;

మనలోని రావణుణ్ని పోషిస్తే, మన అహంకారం మనల్ని నాశనం చేస్తుంది.

"రాముడు మనలో ఉంటే మనం రాజులం; రావణుడు మనలో ఉంటే మనం బంధీలం."

ప్రొఫెసర్ విశ్వేశ్వర రావు చెనమల్లు



# అమరావతి నుంచి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పునరుజ్జీవనం

(ప్రతాప్)

ఒక రాజధాని నిర్మాణం అంటే కేవలం పరిపాలనా భవనాల నిర్మాణం కాదు. అది ఒక రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే అవకాశం. ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి అలాంటి అవకాశమే. అయితే రాజధాని అభివృద్ధి ఎంత ముఖ్యమో, దానిని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల ఆర్థిక సామర్థ్యాలతో అనుసంధానించడం అంతకంటే ముఖ్యం. అమరావతి ఒక పరిపాలనా కేంద్రంగా మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పెట్టుబడులు, పరిశ్రమలు, సేవలు, ఉపాధి, వ్యవసాయ విలువవృద్ధికి అనుసంధాన కేంద్రంగా ఎదగాలి.

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ పరిమాణం కూడా ఈ అవకాశానికి బలమైన పునాది. 2025--26లో రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి ప్రస్తుత ధరల ప్రకారం సుమారు రూ.18.3 లక్షల కోట్లుగా అంచనా వేయబడింది. 2024--25లో రాష్ట్ర ఎగుమతులు సుమారు రూ.1.84 లక్షల కోట్లు. వ్యవసాయం, మత్స్యరంగం, ఔషధాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, ఆహార తయారీ వంటి రంగాలు రాష్ట్రానికి ఇప్పటికే బలమైన ఆధారాలు.



అమరావతి అభివృద్ధి ఈ ఆర్థిక శక్తికి అనుసంధానమైతే దాని ప్రభావం రాజధాని ప్రాంతానికే పరిమితం కాకూడదు. విజయవాడ--గుంటూరు ప్రాంతాన్ని రవాణా, విద్య, వైద్యం, ఆర్థిక సేవలు, జ్ఞాన ఆధారిత పరిశ్రమలకు కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు, రాష్ట్రంలోని ఇతర నగరాలతో వేగవంతమైన అనుసంధానం అవసరం. రహదారులు, రైలు మార్గాలు, ప్రజా రవాణా, నీరు, విద్యుత్తు, మురుగునీటి నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలు ముందుగానే సిద్ధమైతేనే పెట్టుబడిదారులకు దీర్ఘకాలిక విశ్వాసం ఏర్పడుతుంది.

ఇక పరిశ్రమల విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు భౌగోళిక ప్రయోజనం విశేషమైనది. విశాఖపట్నం--చెన్నై పారిశ్రామిక మార్గంలో కొప్పర్తి, విశాఖపట్నం, చిత్తూరు ప్రాంతాలు, హైదరాబాద్--బెంగళూరు పారిశ్రామిక మార్గంలో ఓర్వకల్లు, చెన్నై--బెంగళూరు పారిశ్రామిక మార్గంలో కృష్ణపట్నం వంటి కేంద్రాలు రాష్ట్ర పారిశ్రామిక విస్తరణకు కీలకం. కొప్పర్తి పారిశ్రామిక ప్రాంతానికి రూ.2,137 కోట్ల మౌలిక పెట్టుబడితో సుమారు రూ.8,860 కోట్ల పెట్టుబడులను ఆకర్షించే సామర్థ్యం, 54,500 ఉద్యోగాల అవకాశాన్ని అంచనా వేశారు. ఓర్వకల్లు ప్రాంతానికి రూ.2,786 కోట్ల ప్రాజెక్టు వ్యయంతో రూ.12,000 కోట్ల పెట్టుబడులు, 45,071 ఉద్యోగాల సామర్థ్యం ఉందని కేంద్ర ప్రభుత్వ సమాచారం పేర్కొంటోంది.

రాష్ట్రానికి ఉన్న సుమారు 974 కిలోమీటర్ల సముద్రతీరం మరో ప్రధాన బలం. ఓడరేవులను కేవలం సరకు ఎగుమతి--దిగుమతుల కేంద్రాలుగా కాకుండా, వాటి చుట్టూ తయారీ పరిశ్రమలు, గిడ్డంగులు, శీతల నిల్వలు, ఆహార శుద్ధి కేంద్రాలు, రవాణా సేవలు అభివృద్ధి చేయాలి. తీర ప్రాంత ఆర్థిక వ్యవస్థను రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల ఉత్పత్తి కేంద్రాలతో అనుసంధానిస్తే రాష్ట్రవ్యాప్తంగా సరఫరా వ్యవస్థ బలపడుతుంది.

వ్యవసాయరంగం విషయంలోనూ ఇదే దృష్టి అవసరం. వరి, మిరప, పత్తి, పప్పుధాన్యాలు, ఉద్యాన పంటలు, మత్స్య ఉత్పత్తుల్లో రాష్ట్రానికి ఉన్న బలాన్ని విలువవృద్ధి, నిల్వ, శీతల గొలుసు, ఆహార శుద్ధి, ఎగుమతులుగా మార్చాలి. రైతు పొలంలో ఉత్పత్తి చేసిన వస్తువుకు మార్కెట్‌లో అధిక విలువ లభించినప్పుడే గ్రామీణ ఆదాయం పెరుగుతుంది.

సాంకేతిక రంగంలో విశాఖపట్నం వంటి నగరాలను సేవలు, సమాచార సాంకేతికత, కృత్రిమ మేధ, సమాచార కేంద్రాల కేంద్రాలుగా అభివృద్ధి చేయడం మరో అవకాశం. అయితే పెట్టుబడులు రావడం మాత్రమే విజయానికి కొలమానం కాదు. స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ, పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులు, చిన్న--మధ్య తరహా సంస్థలకు సరఫరా అవకాశాలు కల్పించాలి. ఇటీవల రాష్ట్రంలో ఆమోదించబడిన పెట్టుబడులు రూ.9 లక్షల కోట్లకు పైగా ఉండి, 8.5 లక్షలకు పైగా ఉద్యోగాల అవకాశాన్ని కల్పించగలవని పెట్టుబడి ప్రోత్సాహక సంస్థ సమాచారం చెబుతోంది. ఇవి ఆమోదాలే తప్ప తక్షణ ఉద్యోగాలుగా పరిగణించరాదన్న వాస్తవాన్ని కూడా గుర్తుంచుకోవాలి.

ముందున్న కార్యాచరణ స్పష్టంగా ఉండాలి. అమరావతిని పరిపాలనా--జ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు, విశాఖపట్నాన్ని తీర పారిశ్రామిక--సాంకేతిక కేంద్రంగా, రాయలసీమను తయారీ--ఇంధన కేంద్రంగా, కోస్తా ప్రాంతాన్ని వ్యవసాయ--మత్స్య--ఆహార ఎగుమతి కేంద్రంగా అభివృద్ధి చేసే పరస్పర అనుసంధాన వ్యూహం అవసరం. ప్రతి జిల్లాకు ప్రత్యేక ఆర్థిక బలం గుర్తించి, మౌలిక వసతులు--పరిశ్రమ--నైపుణ్యం--ఉపాధిని ఒకే ప్రణాళికలో కలపాలి. అమరావతి నిర్మాణం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఆరంభ బిందువు కావాలి; అంతిమ గమ్యం కాదు. రాజధాని వెలుగులు రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికి చేరినప్పుడే పునరుజ్జీవనం సంపూర్ణమవుతుంది. పెట్టుబడులు కొన్ని నగరాల్లో కేంద్రీకృతమై సంపదను సృష్టించడం కంటే, ప్రతి ప్రాంతం తన ప్రత్యేక సామర్థ్యంతో విలువను సృష్టించే ఆర్థిక వ్యవస్థను నిర్మించడమే అసలైన విజయం. అమరావతి ఒక నగరంగా ఎదగడం ముఖ్యం; కానీ అమరావతి నుంచి ఆంధ్రప్రదేశ్ అంతటా అవకాశాలు విస్తరించడమే చరిత్రాత్మక విజయమవుతుంది.



# గంట మహత్యం

మానవులందరూ భగవంతుని దర్శనం కోసం దేవాలయానికి వెళతారు. గుడికి వెళ్ళిన తరువాత ప్రదక్షిణలు చేసి, దేవునికి నారికేళములు పుష్పము లు, నైవేద్యాలు సమర్పించి అర్చన చేయించుకునే సమయంలో గంటను కొడతారు.

మానవులు అనేక రకాల ఆలోచనలు, చింతలతో మనసును నింపుకొని ఉంటారు. గుడిలో గంట మ్రోగినప్పుడు దాని నుండి వచ్చే ఓంకార శబ్దం వినగానే మనసులో ఉన్న ఆలోచనలన్నీ పటాపంచలై పోతాయి. ఒక క్షణం మనసంతా ఖాళీ అవుతుంది. అప్పుడు మన మనసు పూర్తిగా భగవంతునిపై లగ్నమవుతుంది.

గంట శబ్దంలో ఉన్న ఓంకార నాదం చెవుల ద్వారా శరీరంలోకి వెళ్లి మెదడును ఉత్తేజపరచి చురుగ్గా పనిచేసేలా చేస్తుంది. మన శరీరంలో ఉన్న ఏడు చక్రాలు ఉత్తేజితమవుతాయి. ఈ దివ్యమైన శబ్దానికి చెడు శక్తులన్నీ గుడి బయటే ఉండిపోయి, లోపలికి పవిత్రత మాత్రమే వస్తుందని పెద్దలు చెబుతారు.

ఆగమ శాస్త్రం ప్రకారం గంటలో పై భాగం ప్రాణశక్తికి, కింది భాగం భూమికి సంకేతం. గంట మధ్యలో ఉండే నాలుక మన ఆత్మ లాంటిది. నాలుక కదిలినప్పుడే ఆత్మకు చైతన్యం కలుగుతుంది.

గంటను మూడు సార్లు కొట్టాలి:

1. మొదటిసారి - శరీర శుద్ధికి
2. రెండవసారి - మనసు శుద్ధికి
3. మూడవసారి - ఆత్మ శుద్ధికి

ఈ శబ్ద తరంగాలు చాలాసేపు గాలిలో ఉంటాయి. మన శరీరంలో ఉండే రోగ కారక క్రిములు ఆ తరంగాలకు నాశనమవుతాయి. అందుకే గుడికి వెళ్ళగానే తప్పకుండా గంట కొట్టాలని తెల్సుకోవాలి.



రచన
ఏ. బాల సౌజన్య కుమారి
నంది అవార్డు గ్రహీత
తెలుగు ఆచార్యులు, ఆధ్యాత్మిక ప్రవచనకర్త



## నీలకంటేశ్వర స్వామి ఆలయంలో

# ధ్వజస్తంభం ప్రతిష్ట

**బుచ్చియ్యపేట, జయ జయహే**

వడ్డాది పెద్ద బజారు వీధిలో నీలకంటేశ్వర స్వామి ఆలయం పునర్నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయ అభివృద్ధికి భక్తులు విశేషంగా స్పందిస్తున్నారు.స్థానిక పిఎసిఎస్ చైర్మన్, టిడిపి అధ్యక్షుడు దొండా నరేశ్ ఆర్థిక సహకారంతో ఆలయం వద్ద ధ్వజస్తంభం ప్రతిష్ట కార్యక్రమం పనులు ప్రారంభించారు.శనివారం ధ్వజస్తంభ దాత దొండా నరేశ్ చే అర్చకులు దొంతికుర్తి శ్రీనివాస్ పూజలు జరిపించి శాస్త్రోక్తంగా ధ్వజస్తంభం ప్రతిష్ట పనులు చేపట్టారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి దాడి గోవిందరావు,ఎస్ఎంసీ చైర్మన్ కోవెల వెంకట రమణ, దొండా రమేష్ ,కస్పా కాలువ చైర్మన్ దాడి పెద్ద గోవింద,సయ్యపురెడ్డి మాధవరావు, తలారి శంకర్,కోరుకొండ గురుమూర్తి, ముత్యాల సూరిబాబు,వెలుగుల నాగేశ్వరరావు,అక్కిరెడ్డి కనకరాజు, సయ్యపురెడ్డి వెంకటరావు,దండి లక్ష్మణ్ కుమార్,ఇంటి జగన్నాథ రావు, పీలా రమణ,గుదే గంగరాజు,జనసేన దొండా సాయి, సయ్యపురెడ్డి నవీన్, దొడ్డి శ్యాంసుందర్, బావిశెట్టి శ్రీను, బైపు కామరాజు , పప్పల రాజు, మహిళలలు, భక్తులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయుల బెత్తం దెబ్బలు తిన్నవాడినే

### విద్యార్థుల భవిష్యత్ కు బంగారు బాటలు వేయటానికి నాంది ఉపాధ్యాయులే

**భీమవరం (జయ జయహే)**

చదువుకున్న రోజుల్లో తానూ కూడా ఉపాధ్యాయుల బెత్తం దెబ్బలు తిన్నవాడినేనని, విద్యార్థుల భవిష్యత్ కు బంగారు బాటలు వేయటానికి నాంది ఉపాధ్యాయులేనని డిఎస్పీ రఘువీర్ విష్ణు అన్నారు. భీమవరం శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి కళావేదికపై శనివారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గురు పూజోత్సవం సందర్భంగా 32 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. డిఎస్పీ రఘువీర్ విష్ణు మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులు దైవ స్వరూపాలను వారి గౌరవించాలని అన్నారు. విలువలతో కూడిన విద్యను అందిస్తూ సమాజానికి దిక్సూచిగా ఉపాధ్యాయులు నిలుస్తున్నారని, ఉపాధ్యాయులను గౌరవించుకోవడమంటే మన సంస్కృతిని మనం గౌరవించుకోవడమేనని అన్నారు. మావుళ్ళమ్మ దేవస్థానం ఈవో బుద్ధా మహాలక్ష్మి నగేష్, చైర్మన్ బొండాడ నాగ భూషణం మాట్లాడుతూ సమున్నత జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులు, అధ్యాపకుల పాత్ర అనిర్వచనీయమని, దేశానికి జ్ఞాన సంపన్నులైన, అంకితభావం కలిగిన యువతను అందించేందుకు పాఠశాల, కళాశాల దశల నుంచే బోధన బాధ్యతల్లో ఉన్నవారు తపిస్తారన్నారు. కాకన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పట్టణంలోని వివిధ పాఠశాలలోని 32 మంది ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించామని అన్నారు. గత 5 రోజులుగా వివిధ పాఠశాలలో నిర్వహించి పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంసా పత్రాలను బహుమతులను అందించామన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, పాపోలు ఏడుకొండలు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, నందమూరి రాజేష్ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# సమాజ హితానికి దారిచూపే మార్గదర్శకులు ఉపాధ్యాయులు

**ఆచార్య సి.మంజులత**

**విశాఖపట్నం ఏయూ క్యాంపస్ జయజయహే**

సమాజ గమనంలో మంచి వైపుగా నడిపించే మార్గదర్శకులు ఉపాధ్యాయులను జీవశాస్త్ర విభాగాధిపతి ఆచార్య సి.మంజులత పేర్కొన్నారు. శనివారం ఆంధ్రయునివర్సిటీ జువాలజీ విభాగంలో ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా నేర్చుకుని బోధించాలన్నారు. విద్యార్థి తన జీవితంలో ఎంతో కీలకమైన సమయం విద్యాలయంలో గడుపుతారని పేర్కొన్నారు. విద్యాలయ వాతావరణం బోధకుల వ్యవహారశైలిని అనుసరించి ఆచరిస్తున్నారు. యువత జీవనోపాధికి వివిధ రంగాలను ఎంచుకుంటున్నారని , నిజానికి ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని జీవించాలన్నారు. విద్యాలయ వ్యవస్థలు ఆదర్శప్రాయంగా పారదర్శకంగా ఉండాలని, ఈ విధానాలే దేశ నిర్మాణానికి బలమైన పునాదులు నిర్మిస్తాయన్నారు. విద్యార్థులు నేటి సమాజ పరిస్థితులకు అనుగుణంగా నూతన నైపుణ్యాలను నేర్చుకోవాలని, తపనతో చదవాలని, లక్ష్య సాధనకోసం శ్రమించి సాధించాలన్నారు. కార్యక్రమానికి ముందు విద్యార్థులు ,పరిశోధక జీవశాస్త్ర విభాగాధిపతి సి మంజులతను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రో.రత్నరాజు, పరిశోధకులు ప్రదీప్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మండలంలో

# గ్యాస్ గోడౌన్ ఏర్పాటు చేయాలి

### టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.వి. ప్రసాద్ డిమాండ్..

**కొయ్యూరు : (జయ జయహే ) న్యూస్ సెప్టెంబర్ 06,**

కొయ్యూరు మండలంలోని 33 పంచాయతీల ప్రజలు గ్యాస్ కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జీసీసీ మాజీ చైర్మన్ ఎం.వి.వి. ప్రసాద్ తెలిపారు.ప్రస్తుతం కొయ్యూరు మండలానికి చింతపల్లి నుంచి గ్యాస్ సరఫరా జరుగుతుండటంతో రవాణా ఇబ్బందుల కారణంగా వినియోగదారులకు సకాలంలో గ్యాస్ అందడం లేదని ఆయన పేర్కొన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్య పరిష్కారం కోసం శనివారం మండల ప్రజల తరపున ప్రస్తుత జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ని కలిసి వినతిపత్రం అందజేశామని తెలిపారు. కొయ్యూరు మండల కేంద్రంలోనే గ్యాస్ గోడౌన్ ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు.ప్రజల సమస్యపై కిడారి శ్రావణ్ కుమార్ సానుకూలంగా స్పందించారని, వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి కొయ్యూరు మండల కేంద్రంలో గ్యాస్ గోడౌన్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని ఎం.వి.వి. ప్రసాద్ తెలిపారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు చేపట్టి, 33 పంచాయతీల ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన కోరారు.




## భీమవరం చెక్ పోస్ట్ వద్ద

# పోలీసుల వాహన తనిఖీలు

**కొయ్యూరు (జయ జయహే ) న్యూస్ సెప్టెంబర్ 06,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం భీమవరం చెక్ పోస్ట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై మరియు మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కల్పించారు.వాహనదారులందరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, అతివేగం ప్రమాదకరమని పోలీసులు హెచ్చరించారు. అలాగే మహిళల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**మునగపాక, సెప్టెంబర్ 5, జయ జయహే:**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మునగపాక మండలంలో అత్యంత వైభవంగా ఉపాధ్యాయదినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా 3, 4, 5 తరగతుల విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పడం జరిగింది. తోటి విద్యార్థులను విద్యార్థులుగా భావిస్తూ, విద్యార్థులే ఉపాధ్యాయులుగా అవతారమెత్తి అత్యద్భుతంగా పాఠాలు చెప్పి, ప్రశంసలు అందుకున్నారు.



# మరిడిమాంబ ఆలయానికి విరాళాల వెల్లువ

**మునగపాక, సెప్టెంబర్ 5, జయ జయహే:**

మునగపాక మండలంలోని టీ.సిరసపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మరిడిమాంబ ఆలయానికి గవర్ల అనకాపల్లి గ్రామానికి చెందిన సాధన స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్ 5116 రూపాయలు, తోటాడ గ్రామానికి చెందిన దొడ్డి అప్పారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు దొడ్డి బాలాజీ దంపతులు 10,116 రూపాయలు మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మద్దాల వీరి నాయుడు, మరిడిమాంబ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# మామిడి తోట భూమి పై వివాదం

### న్యాయం చేయాలని బాధితురాలి వేడుకోలు

**బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబర్ 05, జయ జయహే**

బుచ్చినాయుడు కండ్రిగ మండల కేంద్రంలో తన కుటుంబానికి జీవనాధారంగా ఉన్న ఐదు ఎకరాల భూమిపై కొందరు వ్యక్తులు కబ్జాకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ కండ్రాతి లలిత అధికారులను ఆశ్రయించారు. రెవెన్యూ అధికారులు, స్థానిక నాయకుల సహకారంతో తన భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. బాధితురాలి వివరాల మేరకు 2005లో తన భర్త శ్యాంసుందర్ మృతి చెందారని, ఆయన కొనుగోలు చేసిన ఐదు ఎకరాల భూమికి సంబంధించిన పట్టా పత్రాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. గత 20 ఏళ్లుగా ఆ భూమిలో మామిడి తోట సాగు చేసుకుంటూ ఇద్దరు కుమార్తెలను చదివించుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల తమిళనాడుకు చెందిన కొందరు వ్యక్తులు తాము సాగు చేసుకుంటున్న భూమిపై హక్కు కోరుతూ వివాదానికి తెరలేపారని, తప్పుడు పత్రాల ఆధారంగా భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని లలిత ఆరోపించారు. తమ వద్ద భూమికి సంబంధించిన పత్రాలు ఉన్నప్పటికీ న్యాయం కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.తన కుటుంబానికి జీవనాధారమైన భూమి, మామిడి తోటను కాపాడి న్యాయం చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్, ఆర్డీఓను బాధితురాలు కోరారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, భూ హక్కులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.




# సెయింట్ జేవియర్స్ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 05, జయ జయహే**

శ్రీకాళహస్తి పట్టణంలోని ఎల్ఐసీ కాలనీ సమీపంలో ఉన్న సెయింట్ జేవియర్స్ పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్రహ్మకుమారి సమాజం సభ్యులను ఆహ్వానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని సిస్టర్ షేర్లీ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని ఆవిష్కరించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయ, ఉపాధ్యాయిని బృందాన్ని విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నృత్య ప్రదర్శనలు, నాటకాల ద్వారా గురువుల పట్ల తమకున్న అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న బ్రహ్మకుమారి సమాజం సభ్యురాలు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. దేశానికి, సమాజానికి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అరకువేలిలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు..

### పలువురు ప్రముఖులకు ఘనసత్కారం!

**అరకులోయ: జయ జయహే.**

భారత రెండో రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం అరకు వేలి మండల కేంద్రంలోని హరిత రిసార్ట్ గోష్టి లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. మండల ఉపాధ్యాయులు వివిధ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఈ వేడుకలను వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి వంతల త్రినాధరావు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన రావు.అరకులోయ ఏటీడబ్ల్యూఓ అధికారి వెంకటరమణ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. మండల విద్యాశాఖ అధికారి వంతల త్రినాధరావు మాట్లాడుతూ. ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఒక ఉద్యోగంగా కాక, సమాజాన్ని నిర్మించే ఒక పవిత్రమైన బాధ్యతగా రాధాకృష్ణన్ భావించారు. దేశంలో అత్యుత్తమ ఆలోచనలు గలవారే ఉపాధ్యాయులుగా ఉండాలని ఆయన బలంగా విశ్వసించారు. తాను దేశ అత్యున్నత పదవికి (రాష్ట్రపతి) ఎదిగినప్పటికీ, తన జీవితాంతం తను ఒకో 'ఉపాధ్యాయుడినే' అని గర్వంగా చెప్పుకున్నారు. తన పుట్టినరోజును (సెప్టెంబర్ 5) వ్యక్తిగతంగా ఘనంగా జరుపుకోవడం కంటే, దేశంలోని గురువులందరికీ ఆ రోజును అంకితం చేసి 'ఉపాధ్యాయ దినోత్సవంగా' మార్చడం ఆయనకు ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న అంకితభావాన్ని తెలియజేస్తుంది. తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు రూపుదిద్దుకుంటుందని, విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదని ఆయన చేసిన ప్రసంగాలు ఎప్పటికీ ఆచరణీయమని అధికారులు గుర్తుచేస్తుంటారు. కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా విద్యార్థులలో మానవతా విలువలు, నైతికతను పెంపొందించేలా బోధన సాగాలని ఆయన కోరుకున్నారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయ వృత్తి యొక్క గొప్పతనాన్ని, సమాజ నిర్మాణంలో గురువుల పాత్రను వక్తలు కొనియాడారు. అనంతరం మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, ప్రముఖులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, స్థానిక ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# సంస్కృతి సుగంధం...వేదఘోష సంగీతం...!

**పుట్టపర్తి, సెప్టెంబర్ 5, జయ జయహే :**



భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య సన్నిధిలో విశాఖ జిల్లా భక్తుల మూడు రోజుల పవిత్ర పర్తి యాత్ర ఆనందభరితమైన, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, వేద మరియు సంగీత వైభవాల సమ్మేళనంగా భక్తి పరవశంలో ఘనంగా ముగిసింది. సెప్టెంబర్ 3 నుంచి 5 వరకు సాగిన ఈ యాత్రలో విశాఖ జిల్లా నుంచి 2వేల మందికి పైగా భక్తులు పాల్గొని స్వామివారి దివ్య దర్శనం, ఆశీస్సులు పొందారు. యాత్ర ముగింపు సందర్భంగా శనివారం సాయికుల్వంత్ సభా మండపంలో విశాఖ జిల్లా బాలవికాస్ విద్యార్థినీ విద్యార్థులు 'సాయి ప్రేమ కుసుమాలు' పేరిట అద్భుతమైన ఆధ్యాత్మిక సంగీత విభావరిని స్వామివారి పాదపద్మాలకు భక్తిపూర్వకంగా సమర్పించారు. చిన్నారుల మధుర గానంతో సభా మండపం భక్తిరసంతో పరవశించగా, వారి సంగీత ప్రతిభ, ఆధ్యాత్మిక భావన, భక్తిశ్రద్ధలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విశాఖ జిల్లాకు చెందిన పురుష భక్తులు నిర్వహించిన వేదపఠనంతో సాయికుల్వంత్ సభా మండపం వేదఘోషతో మార్మోగింది. వేద మంత్రాల పవిత్ర నాదం, బాలవికాస్ విద్యార్థుల భక్తి సంగీతం కలిసి కార్యక్రమాలకు విశేష ఆధ్యాత్మిక శోభను చేకూర్చాయి. మూడు రోజులపాటు నిర్వహించిన వివిధ ఆధ్యాత్మిక, సంగీత, వేద మరియు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్లో భక్తిభావాన్ని మరింత పెంపొందించాయి. బాలవికాస్ విద్యార్థుల ప్రతిభ, భక్తుల వేదపఠనం, ఆధ్యాత్మిక సంగీత సమర్పణలు, సాంస్కృతిక కార్యక్రమాలు యాత్రకు ప్రత్యేక శోభను చేకూర్చాయి. స్వామివారి దివ్య ఆశయాలను ఆచరిస్తూ ప్రేమ, సేవ, త్యాగ మార్గంలో మరింత అంకితభావంతో ముందుకు సాగాలనే సంకల్పంతో విశాఖ జిల్లా భక్తులు పుట్టపర్తి నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. స్వామివారి దివ్య సన్నిధిలో మూడు రోజుల ఈ పవిత్ర పర్తి యాత్ర భక్తుల హృదయాల్లో చిరస్మరణీయమైన ఆధ్యాత్మిక అనుభూతిగా నిలిచిపోయింది. పూర్ణచంద్ర ఆడిటోరియంలో విశాఖ జిల్లా భక్తులకు శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ అందించిన ప్రేరణాత్మక సందేశం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ భక్తుల రాకతో గత మూడు రోజులుగా పుట్టపర్తి మొత్తం ఒక మహా పండుగ వాతావరణాన్ని సంతరించుకుందన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వంటి పవిత్ర సందర్భంలో ప్రశాంతి నిలయానికి రావడం స్వామి అనుగ్రహమేనని పేర్కొంటూ, "ప్రశాంతి" అంటే కేవలం నిశ్శబ్దం కాదు; అంతరంగ ప్రశాంతత. మనలోని ఆ ప్రశాంతతను మేల్కొల్పేందుకే స్వామి ఈ క్షేత్రానికి 'ప్రశాంతి నిలయం' అని నామకరణం చేశారు అని వివరించారు. స్వామి దృష్టిలో ఎవరూ కొత్తవారు కారని, "మీకు వారు కొత్తవాళ్లు కావచ్చు... కానీ నాకు ఎవరూ కొత్తవారు కాదు. ప్రతి ఒక్కరితో నాకు జన్మజన్మల అనుబంధం ఉంది" అనే స్వామి సందేశాన్ని గుర్తుచేశారు. స్వామి స్థాపించిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, విద్యాసంస్థలు ప్రేమ, సేవ, సమానత్వానికి ప్రతిరూపాలని అన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షల రూపాయలు ఖర్చయ్యే చికిత్సలు, క్లిష్టమైన గుండె శస్త్రచికిత్సలు సైతం పుట్టపర్తి లో ఎలాంటి ఫీజు లేకుండా అందించడం స్వామి వారి అనంతమైన ప్రేమకు, అపారమైన సేవా తత్వానికి నిదర్శనమని తెలిపారు. ఆసుపత్రులను సైతం ఆసుపత్రిలా కాకుండా దేవాలయ వాతావరణంలో, ప్రార్థన, కౌన్సెలింగ్, ఆత్మవిశ్వాసాన్ని నింపే విధంగా స్వామి రూపొందించారని పేర్కొన్నారు.





## విమల విద్యాలయం చిరు నవ్వుల వెనక ఎమ్మెల్యే పల్లా కృషి

**ఉక్కునగరం, సెప్టెంబర్ 5, జయ జయహే**

విశాఖ విమల విద్యాలయంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉక్కు విశ్రాంత అధికారి గుర్రం సత్యనారాయణ, మానవ హక్కుల సంఘం కార్యదర్శి పద్మావతి, కార్మిక నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిత మాట్లాడుతూ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కారణంగానే ఈ పాఠశాల పునః ప్రారంభించడం జరిగిందని, ఇప్పుడు మళ్లీ ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది చిరునవ్వులతో తమ వృత్తిని గౌరవప్రదంగా కొనసాగించేటట్లు అందించిన సహకారం మరువలేనిదని అందుకే ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సిబ్బందిని విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. క్రీడా పోటీలలో విజేతలకు జవాన్ స్పోర్ట్స్ అధినేత పాఠశాల పూర్వ విద్యార్థి రంగబాబు మెమెంటోలతో ఉపాధ్యాయ ఇతర సిబ్బందిని, పాఠశాల పూర్వ విద్యార్థులు చెన్నకేశవ, భరత్ కుమార్ కళ్యాణి చెరిపోతుల మోహన్ కుమార్, ఘనంగా సత్కరించారు. పద్మావతి ఈ పాఠశాలధ క్రమశిక్షణతో వినూత్నమైనటువంటి కార్యక్రమాలతో ముందడుగు వేస్తుందని అభినందించారు. పాఠశాల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాస్టారు వందన సమర్పణ తో కార్యక్రమం ముగిసింది.

## జెడ్పీ చైర్మన్ ' మజ్జి 'కి శుభాకాంక్షలు తెలిపిన రవిరాజు

### నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలంటూ సన్మానం

**విశాఖపట్నం, సెప్టెంబర్ 5, జయ జయహే**

విజయనగరం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, వైఎసార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు పుట్టిన రోజు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విజయ నగరం, విశాఖ జిల్లాల నుంచి ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. వైసీపీ ఉత్తరాంధ్ర జోన్-1 ప్రచార కమిటీ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ జి.వి. రవిరాజు నేరుగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి మజ్జి శ్రీనుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనకు శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండి, ప్రజా సేవలో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రవిరాజుతో పాటు మాజీ కార్పొరేటర్ దల్లి రామకృష్ణారెడ్డి, టెలికం అడ్వైజరీ బోర్డు సభ్యులు బడ్డేటి గంగ మహేష్, సీనియర్ నాయకులు గంటా కామరాజు తదితరులు మజ్జి శ్రీనివాసరావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎసార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మజ్జి శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

# అట్టహాసంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**- జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గణబాబు, విష్ణుకుమార్ రాజు హాజరు**

**- 80 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు, అంతర్జాతీయ క్రీడాకారిణి టి. పూజితకు సత్కారం**

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 5, జయ జయహే :**




డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్టణ్ జయంతిని పురస్కరించుకొని ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. అవార్డుల ప్రదానం, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, ఎంపీ ఎం. శ్రీభరత్, ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ తదితరులు ఈ వేడుకల్లో భాగస్వామ్యం అయ్యారు. అండర్-15 బాలికల విభాగంలో భూటాన్‌తో భారత్ తరపున గోల్‌షార్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని విజయం సాధించిన వెల్లంకి జడ్పీ హైస్కూల్ విద్యార్థి తాతపూడి పూజితను అతిథులంతా దుశ్శాలువాతో సత్కరించారు. అలాగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐదు పాఠశాలలకు స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులు అందజేశారు. వేడుకల్లో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 80 మంది ఉపాధ్యాయులకు అతిథుల చేతుల మీదుగా అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.

**ఐఏఎస్ కాకపోతే...టీచర్ అయ్యేవాణ్ని : జిల్లా కలెక్టర్...!**

ఐఏఎస్ అధికారిని కాకపోయి ఉంటే తప్పకుండా ఉపాధ్యాయ వృత్తినే ఎంచుకునేవాడినని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సేవలకు కొలమానం లేదని, వారి సేవలు వెలకట్టలేనివన్నారు. ప్రతి వ్యక్తి విజయం వెనుకా ఒక ఉపాధ్యాయుడి కృషి తప్పకుండా ఉంటుందన్నారు. తన తల్లి కూడా ఉపాధ్యాయురాలిగా సేవలందించారని గుర్తు చేశారు. ఆమె రెండుసార్లు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డులు అందుకున్న సందర్భాల్లో తాను పక్కనే ఉన్నానని, ఆ జ్ఞాపకాలు ఇప్పటికీ తనకు మధురంగా ఉన్నాయని చెప్పారు. తన జీవితంలో ఎంతోమంది ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా నిలిచారని అన్నారు. కేవలం కరిక్యులమ్‌ను పూర్తి చేయడానికే బోధనను పరిమితం చేయకుండా, ఉత్తమ బోధనా విధానాలను అవలంబిస్తే ఆశాజనక ఫలితాలు సాధించవచ్చన్నారు. ఉపాధ్యాయ వ్యవస్థకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకువచ్చారన్నారు. 'వైజాగ్ బ్రాండ్ టీచర్లు' రావాలి అని, విద్యారంగంలో విశాఖపట్నం నంబర్-1గా నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఇందుకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విశాఖ ఎంపీ శ్రీ భరత్‌తో పాటు ఎమ్మెల్యేలు గణబాబు, విష్ణుకుమార్ రాజు, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ మాట్లాడారు. ఇదొక పవిత్రమైన కార్యక్రమని, ఇందులో భాగస్వామ్యం కావటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను గౌరవించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు సముచిత స్థానం, గౌరవం లభిస్తోందని ఉద్ఘాటించారు. మెగా డీఎస్సీ ద్వారా యువతకు ఉద్యోగవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్ క"మార్, సమగ్ర శిక్ష ఏపీసీ చంద్రశేఖర్, అవార్డు గ్రహీతలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులే సమాజానికి దిశానిర్దేశకులు

**తిరుపతి, సెప్టెంబర్05, జయ జయహే**

తిరుపతి గురుపూజోత్సవం సందర్భంగా తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, నెల్లూరు అర్బన్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డాక్టర్ రెడ్డివారి గురవారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురుపూజోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. జిల్లాలో 65 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి సత్కరించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలను నేర్పి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలిపారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు చైతన్యం కల్పించాలని కోరారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను శాలువా, మెమెంటో, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గిరిజన చట్టాలను హక్కులను కాపాడుకుందాం

**అరకులోయ: జయ జయహే.**



అల్లూరి జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షులు శెట్టి లక్ష్మీనారాయణ ఈ సందర్భంగా మాట్లాడుతూ. ప్రభుత్వ పరిశ్రమాలు ప్రైవేట్ పరం చేయడంతో ఎస్సీ ఎస్టీ వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నాయని రిజర్వేషన్లు కోల్పోతున్నారు. గిరిజన 5షెడ్యూల్ ప్రాంతంలో జీవో నెంబర్ 3 కు స్థానిక అధికారులు వివిధ నాయకులు 1/70 చట్టాలకు రక్షించకుండా బడా బాబులతో కుమ్మక్కై చట్టానికి తూట్లు పొడుస్తున్నారని ఆయన మండిపడ్డారు. పేద ఆదివాసుల భూములు ప్రభుత్వ భూములు ఆ పార్టీల ఆదివాసి నాయకులే బినామీ పేరులతో ప్రోత్సహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, డుంబ్రిగూడ మండలం అరకు పంచాయతీ పరిధిలోని శుక్రవారం సంత జరిగే భూమి స్థలాలు ఆక్రమించి గిరిజన నేతరులకు బినామీగా మారుతున్నారని అన్నారు. హుకుంపేట నందు ఆదివాసి నాయకులు ప్రమేయంతో గిరిజన భూములు అన్యాయకారంగా అవుతుందని అన్నారు. వివిధ గిరిజన ఆదివాసి సంఘం లు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లిన ఆదివాసులకు న్యాయం జరగలేదు అని త్వరలో బి ఎస్ పి పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఉద్యమం చేస్తామని తెలిపారు.

## వినాయక చవితి మండపాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి:

**డుంబ్రిగుడ: జయ జయహే.**



మండలం పరిధిలోని వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాలు ఏర్పాటు చేయదలచిన నిర్వాహకులు ముందుగా అనుమతులు పొందాలని డుంబ్రిగుడ ఎస్సై ఎల్. సురేష్ కుమార్ సూచించారు. గణేష్ ఉత్సవ్ ఆన్లైన్ (పోస్టాల్) ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులో కమిటీ సభ్యుల వివరాలతో పాటు విగ్రహానికి సంబంధించిన వివరాలను నమోదు చేయాలనారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నవారికి నిబధనల మేరకు అనుమతులు జారీ చేస్తామని పేర్కొన్నారు.



## కొయ్యూరు మండలంలో ఘనంగా గురుపూజోత్సవం...

### ఏడుగురు ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం..

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ సెప్టెంబర్ 06,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా, కన్నుల పండుగగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా గిరిజన సహకార సంస్థ మాజీ చైర్మన్ ప్రసాద్ , తహశీల్దార్ , మండల విద్యాధికారి, హాజరయ్యారు. ముందుగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండలంలో విశిష్ట సేవలందించిన ఏడుగురు ఉత్తమ ఉపాధ్యాయులకు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమం లో సాగిన కృష్ణకుమారి గంగవరం, పలాస ఈశ్వరమ్మ రావణాపల్లి, జి. రాజశేఖర్ ముకుడుపల్లి,గొడ్డేటి దాలమ్మ బట్టపనుకులు, మజ్జి సత్యవతి నెల్లిపూడి,గంపా సింహాచలం ముళ్లమెట్ట, కె. మంగ మండపల్లి వారికి సన్మానించి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ... ఉపాధ్యాయుడి గొప్పతనం అతను బోధించిన పాఠాల్లో కాదు, అతని చేతుల్లో రూపుదిద్దుకున్న విద్యార్థుల భవిష్యత్తులో ఉంటుందని, మారుమూల గిరిజన ప్రాంతంలో విద్యా వెలుగులు పంచుతున్న ఈ ఉపాధ్యాయుల సేవ చిరస్మరణీయమని కొనియాడారు. అవార్డు గ్రహీతలకు మండల విద్యా కుటుంబం తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# స్థానిక పోరుకు సిద్ధంకండి



### అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

### జిల్లాల అక్రమ మైనింగ్ కట్టాలి

### గోవాడ సుగర్స్ కార్మికులు, కర్షకుల బకాయిలు చెల్లించాలి

### వైసిపి విస్తృత సమావేశం డిమాండ్

**చోడవరం : సెప్టెంబరు 5, జయ జయహే**

స్థానిక పోరుకు వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు సిద్ధంగా ఉండాలని శనివారం చోడవరం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి విస్తృత సమావేశం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిందిఈ సమావేశానికి మాజీమంత్రి చోడవరం నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ గుడివాడ అమర్నాథ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి రాజ్యసభ సభ్యుడు, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, మాజీమంత్రి ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు మాజీ ప్రభుత్వ విప్పు కరణం ధర్మశ్రీ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో అక్రమ మైనింగ్ అరికట్టాలని, సహకార రంగంలో ప్రతిష్టాత్మకమైన గోవాడ సుగర్స్ లో కార్మికులు కర్షకులకు పాత బకాయిలను ఈ నెల 21 లోగా చెల్లించాలని డిమాండ్ చేశారు. 15 రోజుల్లో చెల్లించి మహాజనసభ నిర్వహించాలని లేనిపక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహాజనని నిర్వహిస్తాదనీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వాతావరణంలో ఎల్నినో ప్రభావం కొనసాగుతుండడంతో నేటి వరకు వర్షాలు కురవక, వరి నాట్లు వేయలేని పరిస్థితి రావడంతో... అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకుల అండదండలతో బడాబాబులు, వ్యాపారులు ... ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలనేవి చూడకుండగా, హిందువుల మనోభావాలు దెబ్బ తినే విధంగా అక్రమ మైనింగ్ చేపడుతున్నారని, జిల్లాలో అక్రమ మైనింగ్ ఆపకుంటే ఉద్యమిస్తామన్నారు. గత ప్రభుత్వం కంటే గోవాడ సుగర్స్ రైతులకు రూపాయి ఎక్కువగా మద్దతు ధర చెల్లిస్తామంటూ ప్రగల్భాలు పలికిన కూటమి నేతలు రెండు సంవత్సరాలుగా పాత బకాయిలు చెల్లించలేక ముఖం చాటేస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అన్నారు ఈ నెల 21 లోగా బకాయిలు చెల్లించలేని పక్షంలో వైసిపి ఆధ్వర్యంలో సభ్య రైతులతో మహాజన సభ నిర్వహించనున్నట్లు తెలియజేశారు తమ హయాంలో గోవాడ సదస్సులో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు సమాలోచన చేస్తే, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక డిస్టలరీ ఏర్పాటుకు యోచన చేసిందని, ప్రస్తుతం చెరుకు రైతులకు పాత బకాయిలే చెల్లించకుండా రెండు సంవత్సరాలుగా క్రషింగ్ జరుపకుండా, ఫ్యాక్టరీను మూలకు తోసిన ఘనత కూటమి నాయకులదే అని తెలిపారు. డీఎస్సీలో మెగా డీల్, లోపాలను సవరించకుండా కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోందని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో లోపాలను ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత వైసిపి నాయకులు కార్యకర్తలకు ఉందన్నారు. కాగితం పులి మాటున కూటమి నేతలకు భయపడితే ..., స్థానిక పోరులో ఓటమి తప్పదని, నేటి నుండే కూటమి పాలనలో లోపాలను ఎత్తిచూపుతూ,... స్థానిక పోరుకు వైసీపీ నేతలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ డా. భీశెట్టి సత్యవతి,నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, అనకాపల్లి జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్, యువజన విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, చోడవరం టౌన్ అధ్యక్షులు దేవరపల్లి వీర వెంకట సత్యనారాయణ (సత్య), ఓరుగంటి నెహ్రూ బాబు, బుచ్చయ్యపేట జడ్పిటిసి దొండా రాంబాబు, దొండా నారాయణమూర్తి, సి డి సి చైర్మన్ సుంకర శ్రీనివాస్ జిల్లాలో గల వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## విశాఖలో మిఠాయిలు పంచుకున్న ఏపీఎన్‌జీవో నేతలు

### - టపాసులు పేల్చి సంబరాలు

### - సీఎంతో ఏపీ జేఏసీ చర్చలు సఫలం

**విశాఖపట్నం, సెప్టెంబర్ 5, జయ జయహే**

సీఎం చంద్రబాబుతో ఉద్యోగ సంఘాల నేతలు జరిపిన చర్చలు సఫలం కావడంతో విశాఖలోని ఏపీఎన్‌జీవో నేతలు సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు మిఠాయిలు తినుపించుకుంటూ ఆనందోత్సాహాలు జరుపుకున్నారు. కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఏపీ ఎన్‌జీవో జిల్లా కార్యాలయ ప్రాంగణంలో ఎన్‌జీవో నేతలంతా శనివారం కలసి మానవ హారంగా ఏర్పడ్డారు. పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చి ఒకరికొకరు అభినందనలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ ఛైర్మన్ కె. ఈశ్వరరావు, జేఏసీ కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, ఏపీ ఎన్‌జీజీవోస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. రవి శంకర్, ఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి ఎం. రవి కుమార్, నగర అధ్యక్షులు వై. నారాయణరావు, సిటీ సెక్రటరీ జి. చంద్రరావు, జిల్లా కోశాధికారి అప్పలరాజు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. సత్తిబాబు తదితరులు హాజరై ప్రభుత్వ ఉద్యోగుల తరపున పోరాటాలు చేసి ప్రోత్సాహకాలు సాధించిన నేతలకు అభినందనలు తెలిపారు. దాదాపు 8 డిమాండ్ల పట్ల సీఎం చంద్రబాబు సానుకూలంగా నిర్ణయం ప్రకటించడంతో ఉద్యోగ సంఘాలు ఆనందోత్సాహాలు జరుపుకుంటున్నారని ఎన్‌జీఓ అధ్యక్షులు కే. ఈశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలే కాకుండా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పట్ల కూడా ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. అలాగే పెన్షనర్ల విషయంలో కూడా ఆర్థిక పరమైన పెండింగ్ సమస్యలను చక్కదిద్దుతామని సీఎం హామీనివ్వడాన్ని కొనియాడారు.

## స్పెషల్ డ్రైవ్‌లో ప్రత్యేక దాడులు

### పలువురు అరెస్ట్

**చోడవరం సెప్టెంబరు 5 జయ జయహే**




ప్రొహిబిషన్ ఎక్సైజ్, డైరెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ఈనెల 1 నుండి 5 వరకు చోడవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పలుచోట్ల దాడులు చేపట్టినట్టు ఎక్సైజ్ సీఐ కెవి పాపూనాయుడు శనివారం తెలిపారు. ఈ 6 కేసులలో అనధికార మద్యం షాపులు నిర్వహిస్తున్న 6గురు ముద్దాయిలను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 11.18 లీటర్ల మద్యం ను స్వాధీనం పరచుకున్నట్లు తెలిపారు. అలాగే నాటు సారాయి అమ్మకాలు జరుపుతున్న ఒకరిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుండి 2 లీటర్ల నాటు సారాయి స్వాధీనం చేసుకొనీ కేసు నమోదు చేశామన్నారు. స్టేషన్ పరిధిలో గల చోడవరం, బుచ్చయ్యపేట, కే.కోటపాడు, దేవరాపల్లి లో గత రెండు సంవత్సరాలు సమయంలో సుమారు 134 కేసులలో 100 మంది పై నాటు సారాయి కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి 571.52 లీటర్ల నాటు సారాయి స్వాధీనం చేసుకుని సీజ్ చేయడం జరిగిందన్నారు. అలాగే నాటు సారాయి తయారికి ఉపయోగించే సుమారు 5653 కేజీల నల్ల బెల్లం, 41180 లీటర్ల పులిసిన బెల్లం ఊటలను ధ్వంసం చేసామన్నారు. గ్రామాలలో అనాధికార మద్యం అమ్మకాలు(బెల్ట్ షాప్ లు నిర్వహించిన) జరిపిన వారిపై 210 కేసులలో సుమారు 211 మందిపై కేసులు పెట్టి సుమారు 512.61 లీటర్ల మద్యం ను స్వాధిని పరచుకోవడంతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను కూడా సీజ్ చేయడం జరిగిందన్నారు.గత రెండు సంవత్సరాల్లో జరిగిన లోక్ అదాలత్ లలో అనాధికార మద్యం అమ్మకందారులు నుంచి సుమారు 257 కేసులలో 14,09,691 రూపాయలు గవర్నమెంట్ కు చలానా రూపంలో జరిమానా కట్టించమన్నారు. సత్ప్రవర్తనకోసం బైండోవర్ చేసిన 6 ముద్దాయిలు బైండోవర్ ఉల్లంఘించిన నేరంగాను వారినుంచి 70 వేలు రూపాయలు ఫైన్ ద్వారా వసూలు చేయడం జరిగింది.నాటు సారా తయారు చేసినా అమ్మకాలు జరిపినా కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.



## ఆధ్యాత్మికతకు ఆలయాలు ఎంతో అవసరం

**మాడుగుల సెప్టెంబరు 5 జయ జయహే**

గ్రామాల్లో ప్రజల ఆధ్యాత్మికతకు ఐక్యతకు ఆలయాలు ఎంతో అవసరమని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. పూర్వం రామాలయం వద్ద రచ్చబండ కార్యక్రమం జరిగేవని ప్రజల ఐక్యతకు అది నిదర్శనమని చెప్పారు. శనివారం మాడుగుల లో మామిడి వారి కల్లాల వద్ద 40 లక్షల రూపాయలతో నిర్మించి తలపెట్టిన పోతురాజు బాబు ఆలయానికి, అలాగే కొబ్బరి తోట వీధిలో 20 లక్షల రూపాయలతో నిర్మించి తలపెట్టిన కోన వారి గంగాదేవి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణం ముఖ్యం కాదని ఆలయ నిర్వహణ ఎంతో ముఖ్యమని చెప్పారు ఈ ఆలయాలను బాధ్యతగా నిర్వహించుకోవాలని ప్రజలలో ఐక్యత ఆధ్యాత్మికత పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ, సహకార సంఘ అధ్యక్షుడు కొట్నాల త్రినాథరావు ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఎంత ఎత్తు ఎదిగిన గురువుని మించిన దైవం లేదు

**కోటబొమ్మాళి, సెప్టెంబర్ 5 జయ జయహే**



ఉపాధ్యాయుల దినోత్సవ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం గంగారాం గ్రామానికి చెందిన విశ్రాంత మున్సిపల్ పేడాడ రాంబాబు నీ పలువురు పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. శ్రీకాకుళంలో గల సొంత నివాసానికి వెళ్లి దంపతులకు పాదాభివందనం చేసి ఆ దంపతులు ఆశీస్సులు తీసుకున్నారు. వారిలో సామాజికవేత్త చైల్డ్ ప్రొడక్షన్ డైరెక్టర్గా పనిచేసిన కొత్తకోట శ్రీనివాసరావు ఎవరు ఎంత ఎత్తుకు ఎదిగినా చదువు చెప్పిన గురువునీ మించిన దైవం లేదని కొనియాడరు. రాంబాబు వద్ద మన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడు ధర్మపత్నంకి, పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు వంటి ప్రముఖులతో పాటు ఆయన వద్ద చదువుకున్న విద్యార్థులు నేడు వైద్యులుగా,ప్రాజెక్ట్ డైరెక్టర్ గా వివిధ శాఖలలో ఉన్నతమైన వివిధ స్థాయిలో ఉన్నారని తెలిపారు. వారందరిని తీర్చిదిద్ది తాను మాత్రం అదే గురువు స్థానంలో ఉంటూ ఆనందపడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత స్థానాన్ని బాధ్యతగా చేపట్టి ఆవృత్తికే వన్నె తెచ్చిన వ్యక్తి ఎందరందరికో గురువైన పేడాడ రాంబాబు అందరివాడే అన్నారు.




## పాయకరావుపేటలో గురుపూజోత్సవ కార్యక్రమం

**పాయకరావుపేట, సెప్టెంబర్ 5 జయ జయహే**

పాయకరావుపేట లో శనివారం గురుపూజోత్సవ కార్యక్రమాలు వనిత క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంగవరం రోడ్ రామాలయంలో పలువురు ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ పి ఎస్ టి లు సభ్యులు పాల్గొన్నారు.



## దళిత, గిరిజనుల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి కొత్తపల్లి శంకర్

**విజయవాడ, సెప్టెంబర్ 05, జయ జయహే**

విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో ఎస్సీ, ఎస్టీ కాన్ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆనంద్ ఆధ్వర్యంలో 'సేవ్ ఇండియా -- సేవ్ కాన్స్టిట్యూషన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాన్ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఉదిత్ రాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా దేశంలోని దళిత, గిరిజనులు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి సమస్యలపై సమావేశంలో చర్చించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వాన్ని పరిరక్షించేందుకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘర్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.




## బాలుకి మండల విద్యా శాఖ సన్మానం

**తొట్టంబేడు, సెప్టెంబర్ 05, జయ జయహే**

తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్య పాళెం ఫౌండేషన్ స్కూల్ లో పనిచేస్తున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కయ్యూరు బాలసుబ్రమణ్యం,ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ తరపున ఫిన్లాండ్ విద్యా అధ్యయన పర్యటనకు వెళ్లి వచ్చిన సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని మండలం విద్యా శాఖ సన్మానం చేసారు. మండలాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకొని వెళ్ళి, వినూత్న అధ్యయన నైపుణ్యాలతో విద్యా వ్యవస్థ లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొని రావాలని మండలం విద్యా శాఖ అధికారులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో భారతి,మునితిరుమలయ్,భాస్కర్,గోమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు

**నంద్యాల (జయ జయహే)**

క్రాంతినగర్ లో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం నందు గత ఐదురోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ప్రముఖ వ్యాఖ్యాత ఉపన్యాసకులు డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులుచే శ్రీమద్రామాయణం, మహాభారతం, భాగవతాలపై ధార్మిక ప్రవచనాలు, ప్రతిరోజు బాలనాగిరెడ్డి బృందంచే భజనలు, ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక అర్చకులు వై. సి.సంగీత్ కుమార్ భక్తులందరితో సామూహిక కుంకుమార్చనలు, గోమాతకు పూజలు చేయించారు. ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలనుకున్నవారికి తి.తి.దే. సహకరిస్తుందని తి.తి.దే. హిందూ ధర్మప్రచారపరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.వెంకటేశ్వర రెడ్డి, మిట్టా వెంకటేశ్వరరెడ్డి, శివారెడ్డి, అంగడి సుబ్బారెడ్డి, జి. చెన్నారెడ్డి, జి. చెన్నారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మి, స్వప్న, కృష్ణకుమారి, పక్కీరమ్మా, ప్రమీల, రమాదేవి, కుమారి, తులశమ్మతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## రైతుకు హక్కు పాస్ పుస్తకం

**మాడుగుల సెప్టెంబర్ 5 జయ జయహే**

రైతుకు తన భూమి మీద పాస్ పుస్తకం ద్వారా హక్కు లభిస్తుందని అటువంటి పాస్ పుస్తకాలను రైతులు భద్రపరచుకుని సద్వినియోపరుచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. శనివారం మాడుగుల మండలం కేజపురం గ్రామంలో 1700 మంది రైతులకు ఆయన పాస్ పుస్తకాలను అందజేశారు. గత ప్రభుత్వం రైతుల పట్ల వివక్ష చూపిందని కానీ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. అందుకే పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి పూర్తి హక్కులతో పాస్ పుస్తకాల అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి అప్పల్రాజు, తహసిల్దార్ కే రమాదేవి, క్లస్టర్ ఇంచార్జ్ పి విజయలక్ష్మి స్థానిక నాయకులు రైతులు పాల్గొన్నారు.

For a pure tomorrow..
జయహే

# ఆర్ అండ్ బి రోడ్ల దుస్థితిపై లీగల్ సర్వీసెస్ అథారిటీ కీలక పరిణామం

## కోర్టు జోక్యంతో చురుగ్గా సాగుతున్న ప్రధాన రహదారుల పనులు -

## హర్షం వ్యక్తం చేసిన న్యాయవాదులు, ప్రజలు, ప్రయాణీకులు

**చోడవరం : సెప్టెంబరు 5 , జయ జయహే**



అనకాపల్లి జిల్లాలో ప్రయాణికులకు నరకం చూపుతున్న ప్రధాన రహదారుల దుస్థితిపై దాఖలైన పిటిషన్‌పై ఆర్ అండ్ బి అధికారుల స్పందనకు న్యాయవాదులు, ప్రయాణికులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ చోడవరం న్యాయవాదుల సంఘం శనివారం మీడియాతో సమావేశమయ్యారు. దీనిపై న్యాయవాదుల బార్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్ మాట్లాడుతూ రహదారుల దుస్థితిపై లీగల్ సర్వీసెస్ అథారిటీ కోర్టులో పి ఎల్ సి నాలుగు బై 2025 జూలై 2025లో ప్రజా ప్రయోజనార్థం కేసు దాఖలు చేసినట్లు తెలిపారు. కోర్టు వాయిదాల్లో పలుమార్లు విచారణ కొనసాగుతూ ఉండగా, అనకాపల్లి - మాడుగుల, నర్సీపట్నం - సబ్బవరం వయా చోడవరం వరకు ఉన్న ఆర్ అండ్ బి రోడ్లు పూర్తిగా గుంతలు పడి దెబ్బతినడంతో, ప్రజల కష్టాలను గుర్తించిన చోడవరం లీగల్ సర్వీస్ అథారిటీ ముందు న్యాయవాదులు శరత్ భూషణ్, బి. రాజుల నేతృత్వంలో చోడవరం బార్ అసోసియేషన్ సభ్యులు ప్రజా ప్రయోజనార్థం 2025లో కోర్టులో కేసు దాఖలు చేశామన్నారు. ఈ పిటిషన్‌పై స్పందించిన కోర్టు.. ఆర్ అండ్ బి అధికారులకు నోటీసులు జారీ చేసి వివరణ కోరిందని, కోర్టు ఆదేశాల మేరకు అధికారులు ఇచ్చిన అండర్‌టేకింగ్ ఆధారంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో రోడ్ల పనులు ఊపొందుకున్నాయిని తెలియజేశారు. ప్రస్తుతం అనకాపల్లి - చోడవరం రోడ్డు పనులు పూర్తవుతుండగా, గోవాడ షుగర్ ఫ్యాక్టరీ విజయరామరాజుపేట వద్ద మాత్రం కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయిన్నారు. ఈ ప్రాంతాల్లోని పనులను డ్యామేజ్ రిపేర్ స్కీమ్ కింద వేరే కాంట్రాక్టర్‌కు అప్పగించామని, త్వరలోనే ఆ పనులు కూడా పూర్తి చేస్తామని ఆర్ అండ్ బి అధికారులు కోర్టు లో తెలిపారన్నారు. అలాగే వడ్డాది నుంచి నర్సీపట్నం వరకు ఉన్న రోడ్డును కూడా నెల, రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు వెల్లడించారన్నారు. ప్రజల ఇబ్బందిని గుర్తించి కోర్టును ఆశ్రయించి, రోడ్ల అభివృద్ధికి కారకులైన న్యాయవాదులకు, స్పందించి పనులు చేపడుతున్న ఆర్ అండ్ బి అధికారులకు చోడవరం న్యాయవాదుల సంఘం, స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. రహదారుల పురోగతికి సంబంధించి పూర్తి నివేదిక సమర్పించాలని కోర్టు ఈ కేసును 2026 సెప్టెంబర్ 19కి వాయిదా వేసిందని తెలిపారు.




# సగం కూడా నిండని ఏరో ఎక్స్‌ప్రెస్ బస్సులు...!

## ఆ బస్సులు ఎక్కేందుకు ఆసక్తి చూపని ప్రయాణీకులు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 5, జయ జయహే**

ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఏరో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణీకులు సంఖ్య నానాటికీ దిగజారిపోతోంది. బస్సులు అలా రోడ్లపై తిరగడమే తప్పా ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణీకుల జాడ కనిపించడం లేదని బస్సు డ్రైవర్లు వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు నిరంతరం బస్సులపై దృష్టి సారించినా ఫలితాలు రావడం లేదని అధికార వర్గాలు వాపోతున్నాయి. మొత్తానికి ఏదో నడిపించేస్తున్నాములే అన్నట్టుగా ఈ బస్సుల పరిస్థితి కనిపిస్తోంది. సాధారణ సిటీ బస్సులు మాత్రం రోజు రోజుకూ తీసికట్టుగానే ఉంది. కాలేజీల విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లే ప్రయాణీకుల సంఖ్య పెరుగుతుంటే...ఆ బస్సుల సంఖ్య మాత్రం తగ్గిపోతోంది. ఇంకా చాలా బస్సులు కొన్ని స్టాపుల్లో ఆపకుండానే వెళ్లిపోతున్న పరిస్థితి నెలకొంది. బస్సుల తాజా పరిస్థితిపై శనివారం విశాఖపట్నం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి అప్పలనాయుడు ఇతర అధికారులతో కలసి పాత గాజువాక నుండి అంతర్జాతీయ విమానాశ్రయము వరకూ తిరుగుతున్న ఏరో ఎక్స్ప్రెస్ బస్సులను తనిఖీ చేశారు. అలాగే పాత గాజువాక నుండి ఎనఏడి, మద్దిల పాలెం హైవే మీదుగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయము వరకు నడుపబడుచున్న పది బస్సులు, పాత గాజువాక నుండి సింధియా, రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ ఆర్.కె. బీచ్ మీదుగా మరో పది బస్సులు తిరుగుతున్నాయని, ఈ బస్సులన్నీ కూడా నిర్దేశించిన వేళలలో సుమారు రెండు గంటలు సమయం పడుతున్నదని ప్రయాణికులు ఏరో ఎక్స్ప్రెస్ బస్సులను ఎప్పటికప్పుడు ఏపీఎసఆర్టీసీ వెహికల్ ట్రాకింగ్ లో తెలుసుకోవచ్చని, గూగుల్ ప్లేస్టోర్ నుండి ఏపీఎసఆర్టీసీ యాప్ ను డౌన్లోడ్ చేసుకొని ఈ ఏరో ఎక్స్ప్రెస్ ల సమయాలను తెలుసుకోవచ్చని, రోజు రోజుకి పెరుగుతూ ఆఖరికి 40 శాతానికి ఆక్యుపెన్సి రేషియో పెరుగుతుందని, ఈ అవకాశాన్ని ఎయిర్ పాసింజర్స్ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ ఏరో ఎక్స్ప్రెస్ బస్సుల సమయ వేళలన్నీ కూడా గూగుల్‌లో కూడా లభిస్తాయని, దీన్ని డౌన్లోడ్ చేసుకోవలసిందిగా కోరారు. అలాగే ఏపీఎసఆర్టీసీ విశాఖ జిల్లాలో ఆన్ కాల్ డ్రైవర్ల అవసరం ఎక్కువ ఉన్నదని, వారు ఎప్పటికప్పుడు వారి దగ్గరగా వున్న డిపో మేనేజర్ ల వారిని సంప్రదించినట్లైతే వారికి డ్రైవర్లు వృత్తి దొరుకునని, రెండు సంవత్సరాలు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వాళ్ళు డిపో మేనేజర్ వారిని కలవొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మెకానికల్ ఇంజినీర్ ఏ గంగాధర్, గాజువాక డిపో మేనేజర్ మల్లేశ్వర రావు, గ్రీన్ సెల్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ కుమార్, గ్రీన్ సెల్ డైరెక్టర్ హరి తదితర ఇంజనీర్స్ సిబ్బంది పాల్గొన్నారు.



# నేతల భీమారావుని ఘనంగా సత్కరించిన పట్టణ ప్రజల సంక్షేమ సంఘం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

టీచర్స్ డే సందర్భంగా నిడదవోలు పట్టణ ప్రజల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. డీఎస్ఓ మున్సిపల్ హైస్కూల్ హెడ్‌మాస్టర్ నేతల భీమారావుని ఘనంగా సత్కరించారు, ఈ సందర్భంగా పట్టణ ప్రజల సంక్షేమ సంఘం అధ్యక్షులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ.. పిల్లలు వస్తువులు కాదని, వారిలోని ప్రతిభను వికసింపజేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, వారిని సక్రమమైన మార్గంలో నడిపించేది గురువులేనని కొనియాడారు.ఐద్వా జిల్లా అధ్యక్షురాలు దిద్దే దయామణి మాట్లాడుతూ.. బాలికలకు విద్య అందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. బాలికలకు విద్య అందించడంలో కీలక పాత్ర పోషించిన భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలేను మహిళలందరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ రజనీ, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# డంపింగ్ యార్డ్‌లో మంటలు పొగలు

## ఆందోళన చెందుతున్న కాలనీవాసులు

**మాడుగుల సెప్టెంబర్ 5 జయ జయహే**

మాడుగుల మోదమాంబ గుడికి వెళ్లే రహదారిలో ఉన్న డంపింగ్ యార్డులో మంటలు పెట్టడం వల్ల పొగలు వచ్చే ఎదురుగా ఉన్న మదమాంబ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంటలు మూలంగా వస్తున్న పొగల వల్ల అనేక రకాల రోగాలు వస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికే పలు మార్లు ఈ విషయాన్ని అధికారులకు తెలియజేశామని డంపింగ్ యార్డ్ మార్పు చేయమని కోరిన పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సరే పంచాయతి వారు స్పందించి డంపింగ్ యార్డ్ మార్పు చేయాలని బిజెపి ప్రతినిధి కే రమేష్ తదితరులు కోరుతున్నారు.



# ఘాట్ రోడ్డు జంక్షన్లో డప్పు ప్రదర్శన

**మాడుగుల సెప్టెంబర్ 5 జయ జయహే**

మాడుగుల మండల అరుంధతి సేవా సంఘం అధ్యక్షులు సిహెచ్ రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం ఘాటి రోడ్డు జంక్షన్ లో భారీగా డప్పులు ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. భారీ ర్యాలీతో ఘాట్ రోడ్ లో గల షుగర్ ఫ్యాక్టరీ చెరుకు కాటా వద్ద జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ , అనుబంధ కమిటీలకు నూతన పాలకవర్గాలు ఎన్నికయ్యాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జ్‌పో సపల్లి వెంకట్రావు మాదిగ పాల్గొని మాట్లాడుతూ సెప్టెంబర్ 9 10 వరంగల్ లో జరిగే జాతీయ మహాసభకు అందరూ హాజరు కావాలన్నారు . గ్రామాల్లో నూతన కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో విశాఖ మాజీ కార్పొరేటర్ కొట్ర కన్నారావు, మాదిగ ఉద్యోగుల సమైక్య విశాఖ జిల్లా నాయకులు గంట్యాడ చిన అప్పలరాజు, అనకాపల్లి జిల్లా మాదిగ ఉద్యోగుల సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు మాదిగ ఉద్యోగుల సమైక్య జిల్లా నాయకులు పులగుజ్జుల రమణ మహాజన సోషలిస్ట్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు ఏలుచూరి ఘాటీలు, మారడపూడి కోటి, పాయకరావుపేట ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ డొక్కా అజయ్ బాబు, గంపల రాజు, పడమట్ల నాగమణి,వత్తుల ఝాన్సీ, ఎం ఎం దాసు, సిహెచ్ వెంకట్రావు పడమట్ల తాతాజీ,బెన్నవోలు నాయుడు, రావాడ రాము, దువ్వదుర్గాలు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు భారీగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం డప్పు కళాకారులని సీనియర్ నాయకులని ఘనంగా సత్కరించారు.

# రెల్లి వీధిలో విద్యుత్ వైర్ల సమస్యకు పరిష్కారం...

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**



నిడదవోలు పట్టణంలోని రెల్లి వీధిలో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా కిందికి వేలాడుతూ ఉండటంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను స్థానికుల తరఫున రంగా రమేష్ ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు.వెంటనే స్పందించిన ఏఈ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి రెల్లి వీధికి చేరుకుని విద్యుత్ వైర్ల పరిస్థితిని పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు తలెత్తకుండా సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.సమస్యపై స్పందించిన మంత్రి కందుల దుర్గేష్, రంగా రమేష్, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్‌కు రెల్లి వీధి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



# గో సంరక్షణకు రూ.లక్ష విరాళం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 05,జయ జయహే**

శ్రీకాళహస్తి గో సంరక్షణ కార్యక్రమానికి తిరుపతికి చెందిన విఘ్నేశ్వర్ సీకేఆర్ దంపతులు రూ.లక్ష ఒక రూపాయి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులకు దేవస్థానంలో స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. దేవస్థానం తరపున తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ బీకే వెంకటేశ్వర్లు, ఏఈఓ లోకేష్ రెడ్డి, డోనార్ సెల్ ఇన్‌చార్జ్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేద విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 05, జయ జయహే**

శ్రీకాళహస్తి సమాజ సేవలోనే నిజమైన ఆత్మసంతృప్తి లభిస్తుందని ప్రముఖ సంఘ సేవకులు, 'ఆంధ్రశ్రీ' అవార్డు గ్రహీత డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం దర్గా వీధిలోని పురపాలక ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో 25 మంది నిరుపేద విద్యార్థులకు తన సొంత ఖర్చులతో విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు.అలాగే పాఠశాలకు క్రాంప్టన్ సీలింగ్ ఫ్యాన్, ట్యూబ్‌లైట్ సెట్, రెండు నీల్‌కమల్ కుర్చీలను వితరణగా అందించారు. గత పదేళ్లుగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు విద్యా సామాగ్రి అందిస్తూ, మౌలిక వసతుల కల్పనకు సహకరిస్తున్నారని ఉపాధ్యాయులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె. వేణు, ఇ. శివతేజ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీలో చోడవరం జనసేన రాజుకి కీలక బాధ్యతలు

**చోడవరం సెప్టెంబర్ 5 జయ జయహే**



జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన కోఆర్డినేషన్ టీమ్‌లో చోడవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి పీవీఎస్ఎన్ రాజుకి స్థానం కల్పించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో పార్టీ కార్యకలాపాలను సమర్థవంతంగా సమన్వయం చేయడం, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకురావడం, ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమాలను పర్యవేక్షించడం వంటి కీలక బాధ్యతలను ఈ సమన్వయ బృందం నిర్వహించనుంది.పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ పీవీఎస్ఎన్ రాజు జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా, పార్టీ నాయకత్వం నిర్దేశించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు.ఈ నియామకం పట్ల చోడవరం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ పీవీఎస్ఎన్ రాజు కి అభినందనలు తెలిపారు.



# జనసేన ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**మాడుగుల సెప్టెంబర్ 5 జయ జయహే**

ఉపాధ్యాయ దినోత్సవశీ సందర్భంగా శనివారం మాడుగుల దేవి ఆడిటోరియంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా సమితి కార్యదర్శి రబ్బ మహేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో గల సుమారు వందమంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. సమాజానికి గురువులు దిక్సూచి అని అలాంటి గురువులను సత్కరించుకోవడం తమ కర్తవ్యం అంటూ మహేష్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత విసి ముర్రు ముత్యాల నాయుడు పలువురు నాయకులు పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com